తెలంగాణ
TELANGANA MUCHATLU
TELTEL/2023/88710
ముచ్చట్లు
తెలుగు దిన పత్రిక
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
వరంగల్ | శుక్రవారం-12- డిసెంబర్ 2025 | సంపుటి : 3 | సంచిక : 194 | పేజీలు - 8 | వెల : రూ 5 | www.telanganamuchatlu.in




# ముగిసిన తొలివిడత పంచాయతీ పోలింగ్

## భారీగా తరలి వచ్చి ఓటేసిన గ్రామీణం

**హైదరాబాద్ , (తెలంగాణ ముచ్చట్లు):**
రాష్ట్రవ్యాప్తంగా తొలి విడుత ఎన్నికల పోలింగ్ ముగిసింది. బుధవారం ఉదయం 7 గంటలకు మొదలైన పోలింగ్.. మధ్యాహ్నం ఒంటిగంటతో పూర్తయ్యింది. పలుచోట్ల ఒంటిగంట వరకు క్యూలో ఉన్న ఓటర్లకు అధికారులు ఓటు వేసే అవకాశం కల్పించారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి కౌంటింగ్ ప్రారంభం అయ్యింది. రాత్రి వరకు పోలింగ్ ఫలితాలు ప్రకటించి.. ఉప సర్పంచ్ ఎన్నికలను నిర్వహించనున్నారు. చెదురుమదురు ఘటనలు మినహా పోలింగ్ ప్రశాంతంగా సాగింది. కలెక్టర్లు, పోలీస్ ఉన్నతాధికారులు పోలింగ్‌ను పర్యవేక్షించారు. తొలి విడుతలో 4,236 సర్పంచ్ స్థానాలకు నోటిఫికేషన్ విడుదల కాగా.. ఇందులో 396 సర్పంచ్ స్థానాలు, 9,633 వార్డు స్థానాలు ఏకగ్రీవమయ్యాయి. మిగతా 3,834 సర్పంచ్ స్థానాలకు పోలింగ్ నిర్వహించారు. 12,960 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. మూడు విడుతల్లో జరుగనున్న పంచాయతీ ఎన్నికల కోసం 93,905 మంది సిబ్బందిని నియమించినట్టు ఎస్ఈసీ కమిషనర్ పేర్కొన్నారు. మూడు విడుతల్లో

మిగతా 2లో

# కాంగ్రెస్ అగ్రనేతలతో సీఎం రేవంత్ భేటీ

## ఇటీవలి తెలంగాణ రైజింగ్ సమ్మిట్‌పై వివరణ
## మెస్సీ కార్యక్రమానికి రావాల్సిందిగా ఆహ్వానం





**హైదరాబాద్ , (తెలంగాణ ముచ్చట్లు):**
'మెస్సీ గోట్ ఇండియా టూర్' కార్యక్రమానికి కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీలను ఆహ్వానించినట్టు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. ఢిల్లీ పర్యటన ముగించుకొని హైదరాబాద్ బయలుదేరే ముందు పార్లమెంట్ ఆవరణలో సీఎం మీడియాతో మాట్లాడారు. ఈనెల 13న ప్రముఖ ఫుట్‌బాల్ క్రీడాకారుడు మెస్సీ హైదరాబాద్ వస్తున్నారు. ఒక ప్రముఖ సంస్థ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో హాజరు అవుతున్నారు. ముఖ్యమంత్రిగా ఉన్నా కాబట్టి నన్ను కూడా ఒక అతిథిగా పిలిచారు. రాష్ట్ర ప్రభుత్వానికి ఈ కార్యక్రమానికి ఎలాంటి సంబంధం లేదు. ప్రముఖ క్రీడాకారుడు వస్తున్నారు కాబట్టి ప్రభుత్వం నుంచి పూర్తి సహకారం ఇస్తున్నాం.

మిగతా 2లో



# ప్రజాసేవకు అంకితమైన నేత ప్రణబ్ ముఖర్జీ

## జయంతి సందర్భంగా సిఎం రేవంత్ నివాళి

**న్యూఢిల్లీ, డిసెంబర్11(తెలంగాణ ముచ్చట్లు):**
భారత మాజీ రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ జయంతి సందర్భంగా.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నివాళులు అర్పించారు. దశాబ్దాల పాటు ప్రజాసేవకు అంకితమైన గొప్ప నాయకుడు ప్రణబ్ ముఖర్జీ.. అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కొనియాడారు. భారత మాజీ రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ జయంతి సందర్భంగా.. ఢిల్లీలోని నివాసంలో సీఎం రేవంత్ రెడ్డి.. ప్రణబ్ ముఖర్జీ చిత్రపటం వద్ద నివాళులర్పించారు.

మిగతా 2లో

# నాణేలు, వారసత్వ అధ్యయనాల్లో తెలంగాణ అగ్రభాగంలో నిలవాలి

- వాటి పరంపరకు దక్షిణ భారతం ప్రసిద్ధి
- నాణేల అధ్యయనం అంటే ఆలోచనల అధ్యయనమే
- న్యూ మిస్ మ్యాటిక్స్ జాతీయ సెమినార్ లో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క




**హైదరాబాద్ , (తెలంగాణ ముచ్చట్లు):**
న్యూ మిస్ మ్యాటిక్స్ (నాణేల అధ్యయనం), వారసత్వ అధ్యయనాల్లో తెలంగాణ అగ్రస్థానంలో నిలవాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు ఆకాంక్షించారు. గురువారం హైదరాబాద్‌లోని మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల విభాగంలో ఏర్పాటుచేసిన దక్షిణ భారతదేశ నాణేలు, ఆర్థిక వ్యవస్థ అనే అంశంపై న్యూ మిస్ మ్యాటిక్స్ సొసైటీ ఏర్పాటు చేసిన జాతీయ సెమినార్ కు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ సదస్సు రెండు రోజులు జరిగే కార్యక్రమంగా మాత్రమే కాకుండా, ఒక చిచ్చరపిడుగులా కొత్త ఆలోచనలను రగిలించే వేదిక కావాలని ఆయన వ్యాఖ్యానించారు.

మిగతా 2లో



# లోక్‌సభలో ఈ- సిగరెట్ దుమారం

## అనురాగ్ ఠాకూర్ ప్రస్తావన..స్పీకర్ ఆగ్రహం

**న్యూఢిల్లీ, డిసెంబర్11(తెలంగాణ ముచ్చట్లు):**
పార్లమెంట్‌లో తృణమూల్ కాంగ్రెస్ పార్టీకి చెందిన ఓ ఎంపీ.. సభా పరిసరాల్లోనే ఈ `సిగరేట్ తాగినట్లు బీజేపీ ఎంపీ అనురాగ్ ఠాకూర్ ఆరోపించారు. లోక్‌సభలో ఆయన ఈ విషయాన్ని స్పీకర్ ఓం బిర్లా ముందు ప్రస్తావించారు. అయితే ఆ ఈ `సిగరేట్ తాగిన వ్యక్తిపై చర్యలు తీసుకోనున్నట్లు స్పీకర్ బిర్లా పేర్కొన్నారు. ఇలా ఎవరు చేసినా సహించేది లేదన్నారు. ఈ మేరకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. ప్రశ్నోత్తరాల సమయంలో సప్లిమెంటరీ అడిగిన సమయంలో బీజేపీ ఎంపీ ఆ విషయాన్ని గుర్తు చేశారు.

మిగతా 2లో



# రాష్ట్రంలో ఈనెల 17 నుండి 21 వరకు రాష్ట్రపతి పర్యటన

- ఏర్పాట్లపై సీఎస్ సమీక్ష
- సమన్వయంతో పని చేయాలంటూ ఆదేశాలు

**హైదరాబాద్ , (తెలంగాణ ముచ్చట్లు):**
రాష్ట్రపతి ద్రౌపది ముర్ము తన శీతాకాల విడిదిలో భాగంగా ఈనెల 17 నుంచి 21 వరకు హైదరాబాద్ లోని రాష్ట్రపతి నిలయంలో బస చేస్తారని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు తెలిపారు.

మిగతా 2లో

# కొండా సురేఖపై ఎన్‌బీడబ్ల్యూ ప్రచారం నిజాలను వెల్లడించిన మంత్రి

**హైదరాబాద్ , (తెలంగాణ ముచ్చట్లు):**
తనకు నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ అయ్యిందన్న కథనాలపై తెలంగాణ మంత్రి కొండా సురేఖ సీరియస్ అయ్యారు. తనకు ఎలాంటి వారెంట్ జారీ కాలేదని.. కోర్టుకు హాజరు కావాలని మాత్రమే కబురు అందిందని స్పష్టత ఇచ్చారు. ఈ క్రమంలో తనపై తప్పుడు ప్రచారం జరుగుతోందని మండిపడ్డారామె.
ఇదిలా ఉంటే.. నాంపల్లి ప్రజాప్రతినిధుల కోర్టు నుంచి కొండా సురేఖకు నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ అయ్యిందని తొలుత ప్రచారం జరిగింది. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ దాఖలు చేసిన క్రిమినల్ పరువు నష్టం కేసులో ఈ పరిణామం చోటు చేసుకుందన్నది ఆ ప్రచార సారాంశం.
''గురువారం (డిసెంబర్ 11, 2025) ఈ కేసు విచారణకు రాగా, నిందితురాలి



గైర్హాజరును న్యాయమూర్తి తీవ్రంగా పరిగణించారు. ఎలాంటి ముందస్తు అనుమతి లేకుండా కోర్టుకు హాజరుకాకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ తక్షణమే ఆమెను అరెస్టు చేసి కోర్టు ముందు హాజరుపరచాలని ఆదేశించారు'' అని ఆ ప్రచారంలో ఉంది.

మిగతా 2లో

# గ్లోబల్ సమ్మిట్ ప్రాంగణానికి సందర్శకులు

## రెండోరోజున పెద్దఎత్తున తరలిరాక

**హైదరాబాద్ , (తెలంగాణ ముచ్చట్లు):**
రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ లో ఏర్పాటు చేసిన వివిధ ప్రభుత్వ స్టాళ్లు, కార్పొరేట్ కంపెనీల స్టాళ్లను గురువారం కూడా పెద్ద ఎత్తున సాధారణ ప్రజలు, విద్యార్థులు సందర్శించారు. ఉదయం నుండే పెద్ద సంఖ్యలో ఈ స్టాళ్లను దర్శించడానికి బారులు తీరారు. తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ రెండో రోజు కార్యక్రమాలు 'డిస్కవర్ తెలంగాణ: కల్చరల్ హెరిటేజ్ అండ్ నెక్స్ జెన్ టూరిజం' అనే అద్భుతమైన సదస్సుతో ప్రారంభమైంది.

మిగతా 2లో



తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లిపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# కాంగ్రెస్ అగ్రనేతలతో సీఎం రేవంత్ భేటీ

(మొదటి పేజీ తరువాయి)



ఢిల్లీలో కలిసిన అందరినీ ఈ కార్యక్రమానికి రావాలని పిలిచానని తెలిపారు. ఈనెల 13న ఉప్పల్ స్టేడియంలో జరిగే ఫుట్ బాల్ మ్యాచ్‌లో మెస్సీ, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, అంతర్జాతీయ ఫుట్ బాల్ క్రీడాకారులు పాల్గొంటున్నారు. మెస్సీ పర్యటన, ప్రముఖుల రాక నేపథ్యంలో పోలీసులు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేస్తున్నారు.ఢల్లీ పర్యటనలో సీఎం రేవంత్ బిజీబిజీగా గడిపారు. ఉదయం పార్లమెంట్‌లో ఏఐసీసీ అధక్షులు మల్లికార్జునఖర్గేతో పాటు రాహుల్ గాంధీ, ప్రియాంకా గాంధీతో సమావేశమయ్యారు. ఇటీవల రాష్ట్రంలో నెలకొన్న తాజా పరిణామాలు, గ్లోబల్ సమ్మిట్‌కు సంబంధించిన అంశాలను వారి దృష్టి తీసుకెళ్లారు. గ్లోబల్ సమ్మిట్‌ను ఏ విధంగా విజయవంతం చేశామనే అంశాలపై చర్చించారు. దిల్లీ పర్యటనకు వెళ్లిన సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి వివేక్‌తో పాటు పార్టీకి చెందిన పలువురు ఎంపీలు వారితో భేటీ అయ్యారు. పార్టీ బలోపేతం, ప్రభుత్వ పనితీరు, సంక్షేమ పథకాల అమలుపై సోనియా, రాహుల్, ప్రియాంకలకు సీఎం రేవంత్ వివరించినట్లు సమాచారం. ఇటీవల నిర్వహించిన గ్లోబల్ సమిట్, పెట్టుబడుల వివరాలను సోనియాకు ఆయన వివరించినట్లు తెలిసింది.



# ముగిసిన తొలివిడత పంచాయతీ పోలింగ్

(మొదటి పేజీ తరువాయి)

జరుగనున్న పంచాయతీ ఎన్నికల కోసం 93,905 మంది సిబ్బందిని నియమించినట్టు ఎన్నికల అధికారులు తెలిపారు. 3,591 మంది రిటర్నింగ్ అధికారులను, 2,489 మంది మైక్రో అబ్జర్వర్లను నియమించినట్లు చెప్పారు. వెబ్‌కాస్టింగ్ ద్వారా 3,461 పోలింగ్ కేంద్రాలను.. 45,086 బ్యాలెట్ బాక్సులను వినియోగిస్తున్నట్లు చెప్పారు. ఇకపోతే పెద్ద సంఖ్యలో ఓటర్లు క్యూన్లలో బారులు తీరి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. తొలి విడుతలో 4,236 సర్పంచ్ స్థానాలకు నోటిఫికేషన్ విడుదల కాగా.. ఇందులో 396 సర్పంచ్ స్థానాలు, 9,633 వార్డు స్థానాలు ఏకగ్రీవమయ్యాయి. ఇక మిగతా 3,834 సర్పంచ్ స్థానాలకు పోటీ చేస్తుండగా.. 12, 960 మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. అలాగే, ఒక గ్రామ పంచాయతీ, పది వార్డుల్లో ఎన్నికలను నిలిపివేసినట్లు ఎన్నికల సంఘం తెలిపింది. 56,19,430 మంది ఓటుహక్కు వినియోగించుకోనున్నారు. ఇందులో పురుషులు 27,41,070, మహిళలు 28,78,159, ఇతరులు 201 మంది ఉన్నారు. మూడు విడుతల్లో జరుగనున్న పంచాయతీ ఎన్నికల కోసం 93,905 మంది సిబ్బందిని నియమించినట్టు ఎస్ఈసీ కమిషనర్ పేర్కొన్నారు. 3,591 మంది రిటర్నింగ్ అధికారులను, 2,489 మంది మైక్రో అబ్జర్వర్లను నియమించినట్టు చెప్పారు. వెబ్‌కాస్టింగ్ ద్వారా 3,461 పోలింగ్ కేంద్రాలను పరిశీలించనున్నట్లు చెప్పారు. 45,086 బ్యాలెట్ బాక్సులను వినియోగించిట్టు చెప్పారు.

# నాణేలు, వారసత్వ అధ్యయనాల్లో తెలంగాణ అగ్రభాగంలో నిలవాలి

(మొదటి పేజీ తరువాయి)

వివిధ సంస్థల మధ్య సహకారం పెరగాలి, యువ పరిశోధకులు అంతరశాస్త్రీయ అధ్యయనాలపై దృష్టి పెట్టాలి, న్యూ మిస్ మ్యాటిక్స్, వారసత్వ అధ్యయనాల్లో తెలంగాణ ముందంజలో నిలవాలి అని డిప్యూటీ సీఎం ఆకాంక్షించారు. వారసత్వ ఆధారిత పరిశోధనకు తెలంగాణ ప్రభుత్వం పూర్తిగా కట్టుబడి ఉంది. పర్యాటక, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు నాయకత్వంలో మన రాష్ట్రాన్ని శాస్త్రీయ అధ్యయనం, సంస్కృతి సంరక్షణ, జ్ఞాన ఉత్పత్తిలో కేంద్రీకృత హబ్‌గా తీర్చిదిద్దడంలో రాష్ట్ర ప్రభుత్వం దృఢసంకల్పంతో ఉందని డిప్యూటీ సీఎం తెలిపారు.




దక్షిణ భారతదేశానికి ప్రపంచంలోనే అత్యంత సమృద్ధిగా నాణేల పరంపర ఉందని భట్టి విక్రమార్క చెప్పారు. శా తవాహనులు, ఇక్ష్వాకులు తమ వాణిజ్య నెట్ వర్క్‌లను నాణేల ద్వారా విస్తరించగా, కాకతీయుల నుండి విజయనగర సామ్రాజ్యపు వైభవం వరకు మన ప్రాంతపు నాణేలు ఆవిష్కరణ, కళాత్మకత, నైపుణ్యమైన రాజ్యపాలనకు ప్రతీకగా నిలిచాయని వివరించారు. ఈ నాణేలు మనతో మాట్లాడతాయి, కొన్నిసార్లు బిగ్గరగా ఆ కాలపు పన్ను వ్యవస్థలు, ముద్రణ, సాంకేతికత, వాణిజ్య ప్రాధాన్యతలు, రాజకీయ దృక్పథం గురించి ఎన్నో విషయాలను వివరిస్తాయని పేర్కొన్నారు. ఈ సదస్సు స్వతహాగానే చారిత్రాత్మకమైనది. వారసత్వ శాఖ ఇంతకు ముందు పురావస్తు, మ్యూజియంల శాఖ 114 ఏళ్ల ప్రయాణంలో తొలిసారిగా నాణేలపై మాత్రమే సర్వాంగ సుందరమైన జాతీయ సదస్సును నిర్వహించడం అభినందనీయం అన్నారు. సామ్రాజ్యాలు ఉదయించడం, అస్తమించడం చూసిన ఈ శాఖకు ఇది నిజంగా ఒక అద్భుతమైన మైలురాయని కితాబిచ్చారు. ఈ సదస్సు తెలంగాణకే కాకుండా రెండు తెలుగు రాష్ట్రాలకూ గర్వకారణమని తెలిపారు. న్యూ మిస్ మ్యాటిక్స్ అంటే చేతిలో పట్టుకునే చిన్న చిన్న లోహపు ముద్రల అధ్యయనం మాత్రమే అనిపించవచ్చు. కానీ ఒక నాణెం పైకి చూస్తే అది ఒక చిన్న ప్రపంచమే కనిపిస్తుందని తెలిపారు. నాణేలు మన పురాతన "కంప్రెస్డ్ డేటా" లాంటివి అని తాను తరచూ భావిస్తుంటానని తెలిపారు. కొద్ది గ్రాముల లోహంలో ఆ కాలం ఆర్థిక వ్యవస్థ, రాజు ఆశయాలు, సాంకేతిక పరిజ్ఞానం, వాణిజ్య మార్గాలు, ధార్మిక చిహ్నాలు, దౌత్య సంబంధాలు అన్నీ అందులో నిక్షిప్తం అయి ఉంటాయని అన్నారు. పురావస్తు శాస్త్రవేత్తలు జిప్ ఫైల్‌ను కనుక్కుంటే దానికి 'కాయిన్' అన్న పేరు పెట్టేవారేమో అనిపిస్తుందని చమత్కరించారు. ఈ రోజుల్లో భారత్ డిజిటల్ చెల్లింపుల్లో, ఫింటెక్ ఆవిష్కరణల్లో ప్రపంచాన్ని నడిపిస్తున్న సమయంలో పద్దెనిమిది పైసల కన్నా క్యూఆర్ కోడ్‌లు ఎక్కువగా కనిపిస్తున్న సమయంలో మన ఆర్థిక ప్రయాణం ఎంత దూరం వచ్చిందో ఈ సందర్భం మనకు గుర్తుచేస్తుందనీ తెలిపారు. వారసత్వం అంటే కేవలం వెనక్కి చూసుకోవడం కాదు, నేటికీ ప్రభావం చూపుతున్న ఆలోచనల ఒక పెద్ద వలయం అర్థం చేసుకోవడమేనని వివరించారు. నాణేలను అధ్యయనం చేయడం అంటే లోహాన్ని కాదు, ఆలోచనను అధ్యయనం చేయడం అని డిప్యూటీ సీఎం అభివర్ణించారు.



# ప్రజాసేవకు అంకితమైన నేత ప్రణబ్ ముఖర్జీ

(మొదటి పేజీ తరువాయి)

ఈ సందర్భంగా.. ప్రణబ్ ముఖర్జీ దేశానికి చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి, ఎంపీలు డా.మల్లు రవి, చామల కిరణ్ కుమార్ రెడ్డి, గడ్డం వంశీ, అనిల్ కుమార్ యాదవ్, నాయకులు రోహిన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రంలో ఈనెల 17 నుండి 21 వరకు రాష్ట్రపతి పర్యటన

(మొదటి పేజీ తరువాయి)

ఐదు రోజులపాటు ఆమె పర్యటన నేపథ్యంలో చేపట్టాల్సిన ఏర్పాట్ల పై గురువారం హైదరాబాద్ లోని సచివాలయంలో ఉన్నతాధికారులతో సీఎస్ సమీక్షించారు. రాష్ట్రపతి పర్యటనకు సంబంధిత అధికారులు సమన్వయంతో పని చేసి విస్తృత ఏర్పాట్లు చేయాలని ఆయన ఈ సందర్భంగా ఆదేశించారు. కేంద్ర ప్రభుత్వ విభాగాలు, రాష్ట్ర ప్రభుత్వ అధికారులు, రాష్ట్రపతి నిలయం అధికారులు సమన్వయంతో ఏర్పాట్లు చేయాలని సూచించారు. పోలీసు శాఖ తగు భద్రతా, ట్రాఫిక్, బందోబస్త్ ప్రణాళికను రూపొందించాలని, అగ్నిమాపక శాఖ అవసరమైన సిబ్బందితో పాటు తగిన అగ్నిమాపక ఏర్పాట్లు, ఫైర్ టెండర్లను ఏర్పాటు చేయాలని, వైద్య, ఆరోగ్యశాఖ వైద్య బృందాన్ని అందుబాటులో



ఉంచాలని ఆదేశించారు. రోడ్లు భవనాల శాఖ విభాగం అవసరమైన బారికేడిరగ్‌లు, ఇతర ఏర్పాట్లు చేయాలని, జీహెచ్ఎంసీ, పోలీసు శాఖల సమన్వయంతో రోడ్ల మరమ్మతులు చేపట్టాలని, నిరంతర విద్యుత్ సరఫరా ఉండే విధంగా తగు చర్యలు తీసుకోవాలని విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు. రాష్ట్రపతి నిలయంలో 24 గంటలు స్నేక్ క్యాచర్ బృందాన్ని అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. జీహెచ్ఎంసీ సమన్వయంతో రాష్ట్రపతి నిలయం పరిసరాల్లో కోతుల బెడదను ఎదుర్కొనేందుకు ప్రత్యేక బృందాలను నియమించాలని, అదేవిధంగా తేనెటీగలను పట్టుకోవానికి ముందుస్తు ఏర్పాట్లు చేయాలని జీహెచ్ఎంసీ అధికారులను ఆదేశించారు. సమీక్షా సమావేశంలో డీజీపీ శివధర్ రెడ్డి, రోడ్లు భవనాల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్, హోమ్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సి.వీ ఆనంద్, హైదరాబాద్ నగర పోలీస్ కమీషనర్ వీసీ సజ్జనార్, ఇంధన శాఖ ముఖ్య కార్యదర్శి నవీన్ మిట్టల్, పొలిటికల్ కార్యదర్శి ఈ. శ్రీధర్, అదనపు డిజిపిలు మహేష్ భగవత్, జీ.హెచ్.ఎమ్.సీ.కమిషనర్ ఆర్.వి.కర్ణన్, అగ్నిమాపక శాఖ డీజీ విక్రమ్ సింగ్ మాన్, సమాచార పౌర సంబంధాల శాఖ స్పెషల్ కమీషనర్ సీహెచ్ ప్రియాంక, ప్రొటోకాల్ డైరెక్టర్ శివలింగయ్య ఇతర ఉన్నత అధికారులు పాల్గొన్నారు.



# లోక్‌సభలో ఈ- సిగరెట్ దుమారం

(మొదటి పేజీ తరువాయి)

సభలో ఈ `సిగరెట్లకు అనుమతి ఉందా అని ఎంపీ అనురాగ్.. స్పీకర్ బిర్లాను అడిగారు. లేదు అని ఆయన సమాధానం ఇచ్చారు. అయితే గత కొన్ని రోజుల నుంచి టీఎంసీ ఎంపీ సభలో ఈ `సిగరేట్ తాగుతున్నట్లు ఎంపీ ఠాకూర్ ఆరోపించారు. ఆ ప్రతిపక్ష ఎంపీపై చర్యలు తీసుకోవాలని అనేకమంది బీజేపీ సభ్యులు డిమాండ్ చేశారు. భారీగా నినాదాలు రావడంతో.. సభ్యుల్ని స్పీకర్ బిర్లా శాంతపరిచారు. హుందాగా వ్యవహరించాలన్నారు.ఒకవేళ ఏదైనా లిఖితపూర్వక ఫిర్యాదు నమోదు చేస్తే, అప్పుగు ఆ ఎంపీపై చర్యలు తీసుకుంటానన్నారు. కొన్నేళ్ల క్రితమే ఇండియాలో ఈ `సిగరేట్లను నిషేధించారు. అయితే సోషల్ మీడియా పుకార్ల ప్రకారం.. టీఎంసీ ఎంపి మహువా మైత్రి.. పార్లమెంట్‌లో ఈ `సిగరేట్లు తాగుతున్నట్లు తెలిసింది.

# కొండా సురేఖపై ఎన్‌బీడబ్ల్యూ ప్రచారం నిజాలను వెల్లడించిన మంత్రి

(మొదటి పేజీ తరువాయి)

అయితే దానిని కొండా సురేఖ కాసేపటికి ఖండించారు.
"కోర్టు నాకు ఎన్‌బీడబ్ల్యూ జారీ చేయలేదు. వచ్చే ఏడాది ఫిబ్రవరి 5న కోర్టుకు రావాలని చెప్పింది. నాపై తప్పుడు ప్రచారం జరుగుతోంది" అని అన్నారామె.
కేసు వివరాల్లోకి వెళితే.. తనపై కొండా సురేఖ చేసిన వ్యాఖ్యలు తన పరువు ప్రతిష్టలకు భంగం కలిగించాయని కేటీఆర్ పరువు నష్టం దాదా వేశారు. ఈ కేసు ప్రస్తుతం విచారణ దశకు చేరుకుంది. గురువారం రోజున విచారణ ప్రారంభం కావాల్సి ఉండగా, నిందితురాలైన కొండా సురేఖ కోర్టుకు రాలేదు. ఆమె గైర్హాజరుకు సంబంధించి న్యాయస్థానానికి ఎటువంటి సమాచారం ఇవ్వకపోవడం, మినహాయింపు కోరుతూ పిటిషన్ దాఖలు చేయకపోవడాన్ని కోర్టు తప్పుబట్టినట్లు తెలుస్తోంది.



# గ్లోబల్ సమ్మిట్ ప్రాంగణానికి సందర్శకులు

(మొదటి పేజీ తరువాయి)

వివిధ కాలేజీల నుంచి వచ్చిన విద్యార్థులు పెద్ద సంఖ్యలో ఈ సదస్సులో పాల్గొని తమ అభిప్రాయాలను వెల్లడిరచారు. తెలంగాణ చరిత్ర, మ్యూజియం సంస్కృతి, పర్యాటక అభివృద్ధి, ఆహార సంస్కృతి తదితర విభిన్న కోణాల్లో విలువైన విశ్లేషణలను ఈ సదస్సులో పాల్గొన్న వక్తలు వివరించారు. తెలంగాణను ప్రపంచ స్థాయిలో ఒక సాంస్కృతిక, పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దే అవకాశాలను వీరు వివరించారు. ఈ సదస్సులో డా. మామిడి హరి కృష్ణ, బిరద్ రాజారామ్, పి. పద్మావతి, గోపీ బైల్లుప్పాల లు పాల్గొని మాట్లాడారు. అనంతరం, తెలంగాణ రైజింగ్` ఎంపవరింగ్ ఆల్, గ్రోవింగ్ టుగెదర్ అనే సదస్సులో ప్రముఖులు విద్యార్థులతో సమావేశమయ్యారు. రాష్ట్ర ప్రభుత్వం రెండు సంవత్సరాలుగా చేపట్టిన ప్రగతిని మరియు తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాలపై క్లుప్తంగా వివరించారు ఈ సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన కళాకారులతో సాంస్కృతి కార్యక్రమాలు నిర్వహించారు ఈ సదస్సు ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఏరోస్పెస్, మూసీ రివర్ డెవలప్మెంట్, హ్యాండీ క్రాఫ్ట్స్, టూరిజం, ఎడ్యుకేషన్, కరీంనగర్ ఇక్కత్, ఫిలిగ్రి,చేర్యాల పెయింటింగ్స్, సైబర్ క్రైమ్ చెదనలో ఉపయోగించే పలు ఆధునాతన పరికరాలు,డ్రోన్స్ , రోబో తదితర 27 కు పైగా స్టాళ్లను సందర్శకులు అత్యంత ఆసక్తిగా తిలకించారు. ప్రధానంగా, ఆధునిక పరికరాలు, వైమానిక అంశాలను ఆసక్తిగా అడిగి తెలుసుకున్నారు. కాగా, రేపు శుక్రవారం ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 7 గంటలవరకు ఈ గ్లోబల్ సదస్సు ను సందర్శించవచ్చని ఒక ప్రకటనలో తెలిపారు.

# రుద్ర బెల్లం టీ స్టాల్‌ను ప్రారంభించిన కార్పొరేటర్ బన్నాల





**చిల్కానగర్, డిసెంబర్ 11 (తెలంగాణ ముచ్చట్లు):** ఉప్పల్ నియోజకవర్గం చిల్కానగర్ డివిజన్‌లోని బ్యాంక్ కాలనీలో ఏర్పాటు చేసిన రుద్ర బెల్లం టీ పాయింట్ ను జిహెచ్ఎంసి స్టాండింగ్ కమిటీ మాజీ సభ్యురాలు, కార్పొరేటర్ బన్నాల గీతా ప్రవీణ్ ముదిరాజ్ ప్రత్యేక అతిథిగా విచ్చేసి ప్రారంభించారు.ఈ సందర్భంగా కార్పొరేటర్ గీతా ప్రవీణ్ మాట్లాడుతూ, యువ పారిశ్రామికవేత్తలు సందీప్ మరియు కీర్తి రాజ్ తమ సొంతంగా టీ స్టాల్ ప్రారంభించడం నిజంగా అభినందనీయమని తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగాల కోసం మాత్రమే ఎదురుచూడకుండా స్వయం ఉపాధి ద్వారా ఎదుగుతున్న యువత సమాజానికి ఆదర్శమని పేర్కొన్నారు.కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్, ఎద్దుల కొండల్ రెడ్డి, ముద్దం శ్రీనివాస్ యాదవ్, మాస శేఖర్, చేర్యాల శ్రీనివాస్, ఫోటో బాలు, మహేష్, సాయిరాం, నరేష్, వేణు, రామ్ ప్రసాద్, కొట్టి శివ తదితరులు పాల్గొన్నారు.

# ఉప్పల్ స్టేడియంలో మెస్సి మ్యాచ్ ఏర్పాట్లపై డిజిపి సమీక్ష





**హైదరాబాద్, డిసెంబర్ 11 (తెలంగాణ ముచ్చట్లు):** ఉప్పల్ రాజీవ్ గాంధీ అంతర్జాతీయ స్టేడియంలో ఈనెల 13న జరగనున్న ప్రపంచ ప్రఖ్యాత ఫుట్‌బాల్ క్రీడాకారుడు లియోనల్ మెస్సి పాల్గొనే ఫుట్‌బాల్ మ్యాచ్ ఏర్పాట్లపై రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ బి. శివధర్ రెడ్డి గురువారం ఉన్నతాధికారులతో కలిసి సమీక్షా సమావేశం నిర్వహించారు.డిజిపి, రాచకొండ సిపి సుధీర్ బాబు తో పాటు జీహెచ్ఎంసీ, విద్యుత్ శాఖ, వాటర్ వర్క్స్, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ, మ్యాచ్ నిర్వాహకులతో కలిసి స్టేడియంలో ప్రత్యక్షంగా పర్యటించి భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు.డిజిపి మాట్లాడుతూ, మ్యాచ్‌కు భారీ సంఖ్యలో ప్రేక్షకులు తరలివచ్చే అవకాశం ఉన్నందున వారికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా లియోనల్ మెస్సికి ఉన్న ప్రపంచవ్యాప్త గుర్తింపు, అలాగే రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి పాల్గొననున్న నేపథ్యంలో భద్రతా ఏర్పాట్లు అత్యంత కఠినంగా ఉండాలని సూచించారు. ప్రేక్షకులకు సంబంధించి భద్రతా మార్గదర్శకాలపై విస్తృత ప్రచారం చేపట్టాలని, ఇందుకోసం మెట్రో రైళ్లు, నగరంలోని ప్రధాన కూడళ్లలో ప్రచార బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు.

అధికారులు స్టేడియం భద్రతా అనుకూలతలను డిజిపికి వివరించారు. 23 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఈ స్టేడియం అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా ఉండి, దాదాపు 39 వేల మంది కూర్చునే సామర్థ్యం కలిగి వుందని తెలిపారు. స్టేడియాన్ని సౌత్, ఈస్ట్, వెస్ట్, నార్త్— నాలుగు ప్రధాన సెక్టర్లుగా విభజించామని వివరించారు.ప్రతిష్టాత్మక ఈ అంతర్జాతీయ మ్యాచ్‌ను లోపాలు లేకుండా విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని డిజిపి సూచించారు.సమీక్షా సమావేశంలో అదనపు డిజిపి మహేష్ ఎం. భగవత్, ఎస్పీఎఫ్ డిజి స్వాతి లక్రా, అదనపు డిజిపి చారు సిన్హా, ఇంటెలిజెన్స్ అదనపు డిజిపి విజయ్ కుమార్, ఫైర్ సర్వీసెస్ డిజి విక్రమ్ సింగ్ మాన్, జాయింట్ సీపీ జోయల్ డేవిస్, మల్కాజిగిరి డీసీపీ శ్రీధర్, ఎన్‌సీబీ ఎస్పీ పద్మజ, తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ కె. శివసేన రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# నాచారంలో షాహి కంపెనీలో మహిళ కార్మికుల సమ్మె నాలుగో రోజు






## యాజమాన్యం స్పందించాలని పిలుపు సిఐటియు

**నాచారం, డిసెంబర్ (తెలంగాణ ముచ్చట్లు):** నాచారం పరిశ్రమ ప్రాంతంలోని షాహి పరిశ్రమలో మహిళా కార్మికులు గత నాలుగు రోజులుగా జీతాలు పెంచాలని డిమాండ్ చేస్తూ సమ్మె కొనసాగిస్తున్నారు. గురువారం రోజు సమ్మె స్థలానికి చేరుకున్న ట్రేడ్ యూనియన్ నాయకులు కార్మికులకు మద్దతు ప్రకటిస్తూ యాజమాన్యం వెంటనే చర్చలకు రావాలని, సమస్యలు పరిష్కరించాలని కోరారు.

సిఐటియు రాష్ట్ర కార్యదర్శి రమ శ్రీకాంత్ మాట్లాడుతూ "మహిళా కార్మికులు తీవ్ర చలిలో రాత్రింబగళ్లు న్యాయమైన డిమాండ్ కోసం పోరాటం చేస్తున్నారు. ప్రస్తుతం తీసుకుంటున్న వేతనాలు సరిపోవు. యాజమాన్యం వెంటనే కార్మికుల సమస్యలను పరిష్కరించాలి" అని అన్నారు.అలాగే కనీస వేతనం రూ.16,000గా నిర్ణయించాలని డిమాండ్ చేశారు.ఐఎఫ్‌టీయూ నాయకులు అరుణ, ప్రదీప్ మాట్లాడుతూ "కార్మికులకు ఇవ్వాల్సిన కనీస వేతనం రూ.18,000. కానీ కేవలం రూ.9,000 మాత్రమే చెల్లిస్తున్నారు. వెంటనే కనీస వేతనం రూ.18,000 అమలు చేయాలి" అని యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు.

ఈ సందర్భంగా గురువారం రోజు సమ్మె చేస్తున్న సుమారు 800 మంది కార్మికులకు సిఐటియు, ఏపీ రాక్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో భోజనాన్ని ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమంలో మణికంఠ, డివి సత్యనారాయణ, రాజశేఖర్, సత్యం, అశోక్, వెంకన్న, లింగస్వామి, రమేష్, ఏఐటిసి నాయకులు సత్యప్రసాద్, ధర్మేంద్ర, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# బలరాంనగర్ వద్దు.. నేరేడ్మెట్ డివిజన్ కావాలంటూ కాలనీ వాసుల డిమాండ్

**నేరేడ్మెట్, డిసెంబర్ 11 (తెలంగాణ ముచ్చట్లు):** జిహెచ్ఎంసి పునర్విభజనలో భాగంగా ఇప్పటి వరకు మల్కాజిగిరి డివిజన్‌గా ఉన్న ప్రాంతాన్ని రెండు భాగాలుగా విభజించి, ఒకదానికి బలరాంనగర్, మరొకదానికి సఫిల్గూడా పేర్లు అమలు చేయడం స్థానిక నేరేడ్మెట్ ప్రజల్లో తీవ్ర వ్యతిరేకతకు దారితీసింది.ఈ నేపథ్యంలో నేరేడ్మెట్ వాసులు పెద్ద సంఖ్యలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ "ఎన్నో ఏళ్లుగా నేరేడ్మెట్ అనే పేరుతో గుర్తింపు ఉన్న ప్రాంతానికి బదులు బలరాంనగర్ అనే కొత్త పేరును పెట్టడం మాకు ఏ విధంగానూ ఆమోదం కాదు" అని స్పష్టం చేశారు.డివిజన్ పేరును బలరాంనగర్‌గా కాకుండా నేరేడ్మెట్ డివిజన్‌గా మార్చాలని హాజరైన గ్రామ పెద్దలు, స్థానికులు ఏకగ్రీవంగా డిమాండ్ చేశారు. అదే విధంగా, రాబోయే జిహెచ్ఎంసి ఎన్నికల్లో నేరేడ్మెట్‌కు టికెట్ కేటాయించాలని ప్రభుత్వాన్ని కోరారు.సమావేశంలో ఎం. బాలలింగం, చాకో, పీ.బీ. సుందర్ యాదవ్, తుపాకుల జనార్ధన్, గంగాధరి కృష్ణ, జీ. శ్రీనివాస్ యాదవ్, ఎల్లిమెల గణేష్, బళ్లారి అశోక్, సానాది శంకర్, తుపాకుల కోటేశ్వర్, టి. మురళీ గౌడ్, కటికల నరేష్, ఈ. నందు యాదవ్, ఏ.ఎల్. లక్ష్మీపతి, మోర శ్రీకాంత్, జే. శివ, పీ. ఈశ్వర్ యాదవ్, బీ. ఈశ్వర్ గౌడ్, జీ. రమేష్, ఏ. రాజు, పీ. శ్రీసైలం, ఎస్. రాజ్ గౌడ్, సూరి, ఎల్లిమెల ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.




# బేతుపల్లిలో అరుదైన ఘనత... అమ్మను గౌరవించిన కూతురు



## తలకొరివితో మాతృభక్తి చాటిన పుల్లమ్మ.

**సత్తుపల్లి, డిసెంబర్ 11 (తెలంగాణ ముచ్చట్లు):** సత్తుపల్లి మండలం, బేతుపల్లి గ్రామంలో చీపి శేషమ్మ (80) అనారోగ్యంతో మృతిచెందారు. అయితే ఆమెకు కుమారులు లేకపోవడంతో, నన్ను కని పెంచిన నా తల్లి... ఆమెకు నేనే తలకొరివి పెడతా అంటూ కూతురు గిరకటి పుల్లమ్మ ధైర్యంగా ముందుకు వచ్చి కర్మకాండను నిర్వహించారు. సాంప్రదాయంగా కుమారులే తలకొరివి పెట్టాలి అనుకునే వారి మధ్య, తల్లిపైన కూతురు చూపిన మాతృభక్తి గ్రామంలో చర్చనీయాంశమైంది. పుల్లమ్మ చేసిన ఈ నిర్ణయాన్ని గ్రామప్రజలంతా హర్షిస్తూ, ఆమెను అభినందించారు.

గ్రామ పెద్దలు మాట్లాడుతూ, ఇది సాంప్రదాయానికి కొత్త అర్థం ఇచ్చే ఘటన... తల్లికి కూతురు చేసిన గౌరవం అందరికీ ఆదర్శం అన్నారు.

# కేసీఆర్ పాలనలో అభివృద్ధిని చూసి ఓటు వేయండి



## మాజీ మంత్రి ఎరబెల్లి దయాకర్ రావు

**హసన్ పర్తి, డిసెంబర్ 11(తెలంగాణ ముచ్చట్లు):** రెండో విడుత సర్పంచ్ ఎన్నికలలో భాగంగా హసన్ పర్తి మండలంలోని నాగారం,సుధానపల్లి,సీతంపేట, అనంతసాగర్, మడిపల్లి గ్రామంలో గురువారం రోజున మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు ప్రచారకార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా దయాకర్ రావు మాట్లాడుతూ బిఆర్ఎస్ ప్రభుత్వంలో దేశంలోనే తెలంగాణను నెంబర్ వన్ రాష్ట్రంగా తీర్చి దిద్దరాని కళ్ళబోలి మాటలు ఆరు గ్యారంటీలా పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారలోకి వచ్చి రాష్ట్రానికి చేసింది ఎమిలేదని అన్నారు.కేసీఆర్ పాలనలో అభివృద్ధిని చూసి బిఆర్ఎస్ పార్టీ బలపరచిన అభ్యర్థులకు ఓటు వేసి గ్రామ అభివృద్ధికి తోడ్పాడాలని సూచించారు.ఈ కార్యాక్రమంలో మండల అధ్యక్షుడు బండి రజని కుమార్,లలిత యాదవ్,ఇంచార్జ్ కుమార్ యాదవ్, ఆయా గ్రామాల సర్పంచ్ అభ్యర్థులు మొట్టే మానస అరుణ్, మేక రమ్య భగవాన్ రెడ్డి, అంబాలా ఉమా రమేష్,బుర్ర రంజిత్ కుమార్,వార్డు సభ్యులు పాల్గొన్నారు.

# సి సి రోడ్ల పనులకు ప్రారంభోత్సవం ఎమ్మెల్యే బండారి



## కార్పొరేటర్ శాంతి సాయిజెన్ శేఖర్

**ఉప్పల్, డిసెంబర్ 11 (తెలంగాణ ముచ్చట్లు):** నాచారం డివిజన్ పరిధిలో రోడ్ల అభివృద్ధి పనులు వేగవంతం అవుతున్నాయి. మొత్తం 35 లక్షల రూపాయల వ్యయంతో రెండు కొత్త సిమెంట్ రోడ్ల నిర్మాణ పనులను ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, నాచారం కార్పొరేటర్ శాంతి సాయిజెన్ శేఖర్ కలిసి భూమి పూజ చేసి ప్రారంభించారు.ఈఎస్ఐ హాస్పిటల్ ఎదురుగా ఉన్న రవీంద్రనగర్ కాలనీలో చిన్న వర్షం వచ్చినా రోడ్డు పూర్తిగా జలమయమవుతుండటంతో, సమస్య పరిష్కారానికి 25 లక్షల రూపాయలతో సిమెంట్ రోడ్డు నిర్మాణానికి శ్రీకారం చుట్టారు.అలాగే శ్రీ రాఘవేంద్రనగర్ కాలనీ ఎంట్రన్స్ వద్ద 100 మీటర్ల మేర రోడ్డు గుంతలమయం కావడంతో, సుమారు 10 లక్షల రూపాయల వ్యయంతో కొత్త సిమెంట్ రోడ్డు పనులను ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఇంజనీర్ బాలకృష్ణ, వర్క్ ఇన్స్పెక్టర్ విజయ్‌కుమార్, నాచారం డివిజన్ బారాస నాయకులు, కార్యకర్తలు, శ్రీ రాఘవేంద్రనగర్ కాలనీ వాసులు, కాంక్రీట్ పలాజో వాసులు, రవీంద్రనగర్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU
ఎడిటర్: పొల్లెపాక రాజేష్ తెలుగు దిన పత్రిక

# వంగాలపల్లి ఉపసర్పంచ్‌గా అరూరి రవిచందర్



## 8వ వార్డు సభ్యునిగా ఏకగ్రీవం

**చిల్పూర్,డిసెంబర్11(తెలంగాణ ముచ్చట్లు):** మండలంలోని వంగాలపల్లి ఉపసర్పంచ్ గా గ్రామానికి చెందిన బిఆర్ఎస్ పార్టీ యువనాయకులు అరూరి రవిచందర్ ఎన్నికయ్యారు.

గత కొన్ని ఏళ్లుగా రాజకీయాల్లో చురుకుగా పనిచేస్తున్న రవిచందర్,బిఆర్ఎస్ పార్టీలో చిల్పూర్ మండల ఉపాధ్యక్షులుగా పనిచేస్తున్నారు.మాజీ డిప్యూటీ సిఎం రాజయ్యకు అత్యంత సన్నిహితులుగా ఉన్న రవిచందర్ వచ్చిన అవకాశాన్ని అందిపుచ్చుకున్నారు.గ్రామంలో స్నేహశీలిగా,సౌమ్యుడిగా పేరున్న రవిచందర్ పంచాయితీ ఎన్నికల్లో 8వ వార్డులో సభ్యునిగా పోటీ చేసి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

వంగాలపల్లి గ్రామంలో గురువారం జరిగిన మొదటి విడత పంచాయితీ ఎన్నికల్లో ఉపసర్పంచ్ గా మెజారిటీ వార్డు సభ్యులు రవిచందర్ పేరు సూచించడంతో రవిచందర్ ఉపసర్పంచ్ గా ఎన్నికైనట్లు ఆర్ఓ(ఎన్నికల అధికారి)ప్రకటించారు.ఈ సందర్భంగా పలువురు రవిచందర్ కు శుభాకాంక్షలు తెలిపారు.

ఈ సందర్భంగా రవిచందర్ మాట్లాడుతూ..."వంగాలపల్లి ప్రజలు నాపై ఉంచిన విశ్వాసాన్ని నిలబెట్టుకుంటాను. గ్రామ అభివృద్ధిని ప్రధాన లక్ష్యంగా తీసుకుని పారదర్శకంగా పని చేస్తాను.సర్పంచ్,పంచాయతీ సభ్యుల సహకారంతో ప్రాథమిక సదుపాయాల మెరుగుదల, శుభ్రత, రోడ్లు,డ్రైనేజీ వంటి పనులను వేగంగా చేపడతాను. ప్రజల సేవకే ఈ బాధ్యతను వినియోగిస్తాను" అని తెలిపారు.



# 95 ఏళ్ల వయసులో రామచంద్రారెడ్డి చారిత్రక విజయం

- ప్రజాస్వామ్యానికి నూతన దిక్సూచి
- సర్పంచ్ ఎన్నికల్లో మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి తండ్రి ఘన విజయం

**తుంగతుర్తి,డిసెంబర్11(తెలంగాణ ముచ్చట్లు):** తుంగతుర్తి నియోజకవర్గంలో అరుదైన రాజకీయ పరిణామం చోటుచేసుకుంది.మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగ్గదీశ్ రెడ్డి తండ్రి, 95 ఏళ్ల స్వాతంత్ర్య సమరయోధుడు గుంటకండ్ల రామచంద్రారెడ్డి నాగారం గ్రామ పంచాయతీ సర్పంచ్ ఎన్నికల్లో అప్రతిహత విజయాన్ని నమోదు చేశారు. ఈ విజయం కేవలం ఒక రాజకీయ ఫలితం కాదని, ప్రజాస్వామ్య విలువలు, సేవాభావం, వ్యక్తిగత నిబద్ధతకు ప్రజలు ఇచ్చిన అపూర్వ గౌరవంగా రాజకీయ విశ్లేషకులు అభివర్ణిస్తున్నారు.

వయస్సు 95 ఏళ్లు దాటినా, రామచంద్రారెడ్డి చూపిన సేవా దృక్పథం, గ్రామ అభివృద్ధిపై దశాబ్దాలుగా కొనసాగుతున్న పట్టుదల ప్రజల విశ్వాసాన్ని మరింత బలపరిచింది. గ్రామ ప్రజలు విస్తృతంగా పోలింగ్ కేంద్రాలకు తరలి వచ్చి ఆయనకు మద్దతు తెలపడం, ఈ ఎన్నికను కేవలం ఓ రాజకీయ పోటీగా కాకుండా, విలువల విజయంగా నిలబెట్టింది. విజయం అనంతరం నాగారం గ్రామం పండుగ వాతావరణంలో మునిగిపోయింది.

జగ్గదీశ్ రెడ్డి కుటుంబం రాష్ట్ర రాజకీయాల్లో ఉన్న సుదీర్ఘ సేవా చరిత్రకు ఈ విజయం మరో ప్రతిష్ఠను తీసుకొచ్చింది. గ్రామీణ ప్రజాస్వామ్యంలో "సేవే నాయకత్వం" అన్న సూత్రాన్ని రామచంద్రారెడ్డి మరోసారి నిరూపించారు. ఈ చారిత్రక విజయం దేశవ్యాప్తంగా గ్రామీణ రాజకీయాలపై చర్చకు దారితీసే అవకాశం ఉంది.

# రైల్వే కోచ్ ఫ్యాక్టరీలో భూ నిర్వాసితులకు స్థానికులకు ఉద్యోగాలు కల్పించాలి

## మాజీ ప్రొఫెసర్ కూరపాటి వెంకట్ నారాయణ



**కాజీపేట్ డిసెంబర్ 11 (తెలంగాణ ముచ్చట్లు):** కాజిపేట్ జంక్షన్ పరిధిలో నిర్మాణం అవుతున్న రైల్వే కోచ్ ఫ్యాక్టరీలో భూ నిర్వాసితులతోపాటు స్థానికులకు ఉద్యోగ అవకాశాలు కల్పించే వరకు ఉద్యమం చేపడుతామని కాకతీయ యూనివర్సిటీ మాజీ ప్రొఫెసర్ వెంకటనారాయణ అన్నారు. తెలంగాణ రైల్వే జేఏసీ ఆధ్వర్యంలో కాజిపేట్ రైల్వే కమ్యూనిటీ హాల్లో గురువారం పత్రిక, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులతో రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశ సందర్భంగా నిర్విరామంగా కోచ్ ఫ్యాక్టరీ కోసం కృషిచేసిన భగవాన్ దాస్, కాళిదాస్ లను స్మరించుకుంటూ రెండు నిమిషాల పాటు అందరూ మౌనాన్ని పాటించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన వెంకటనారాయణ మాట్లాడుతూ కాజీపేటలోని రైల్వే కోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటు నినాదం గత 45 ఏళ్లుగా పోరాటం కొనసాగుతుందని తెలిపారు. భగవాన్ దాస్, కాళిదాసు వంటి సిపిఎం, సిపిఐ నాయకులు ఫ్యాక్టరీని సాధించటం కోసం ఎంతో కృషి చేశారని పేర్కొన్నారు. వారి కృషి ఫలితమే నేడు నిర్మాణం అవుతున్న ఈ కోచ్ ఫ్యాక్టరీ అని తెలిపారు. గతంలో కాజీపేటకు 1985 లో రావలసిన కోచ్ ఫ్యాక్టరీని పంజాబ్లోని కపూర్త లాకు తరలించ తెలిపారు. తెలంగాణ రైల్వే జేఏసీ అనేక నిరసనలు నిరాహార దీక్షలు చేపట్టడం వల్ల మళ్లె కాజీపేటలో ఫ్యాక్టరీ నిర్మాణానికి అడుగులు పడ్డాయి అని ఆయన తెలిపారు. ఫ్యాక్టరీ నిర్మాణం కోసం భూమి తెచ్చిన నిర్వాసితుల కుటుంబాలకు స్థానిక తెలంగాణ ప్రాంత నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు రాకపోతే మరొక్కసారి ఉద్యమ బాట పడతామని ఈ పోరాటానికి తాము పూర్తిస్థాయిలో కృషి చేస్తున్నామని ఆయన తెలిపారు. అనంతరం తెలంగాణ రైల్వే జేఏసీ కన్వీనర్ దేవులపల్లి రాఘవేందర్ మాట్లాడుతూ కోచ్ ఫ్యాక్టరీ సాధనకు చేసిన పోరాటాల స్ఫూర్తితోనే ఇప్పుడు ఉద్యోగాల కోసం మరో ఉద్యమానికి శ్రీకారం చుడుతున్నామన్నారు. నాలుగైదు రోజుల్లో ఉమ్మడి వరంగల్ జిల్లా తెలంగాణ మేధావులతో మరో రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహించి పూర్తిస్థాయిలో పోరాట కార్యక్రమాల కాలెండర్ను ఖరారు చేస్తామని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా కాజీపేట్ మీడియా పాయింట్ అధ్యక్షుడు బత్తిని రాజేందర్ గౌడ్ మాట్లాడుతూ సమిష్టి కృషి వల్ల నేడు కాజీపేటలో కోచ్ ఫ్యాక్టరీ నిర్మాణ దశకు చేరుకున్నది అన్నారు. స్థానిక పార్లమెంట్ సభ్యులు, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, ఇతర సంఘాల నాయకులు కలిసి భూ నిర్వాసితులకు, స్థానిక నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించడం కోసం తోడ్పడాలని ఆయన కోరారు మీడియా పరంగా తమ వంతు సహాయ సహకారాలు ఎప్పటికీ ఉంటుందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో వేద ప్రకాష్, గుర్రపు సుధాకర్ రావు, బి రవీందర్, సంగమయ్య, జిట్ట రాజలింగం, మహేష్, ఎస్ లక్ష్మీనారాయణ, మూర్తి, నాగరాజు, మాధవరావు, రాజయ్య, సూర్యనారాయణ, ప్రవీణ్ కుమార్ లతోపాటు గ్రామ మాజీ సర్పంచ్ గడ్డం యాదగిరి ఇలా సాగరం వీరన్న, దుప్పల్లి రమేష్, మామిండ్ల మల్లయ్య, సజ్జనపు రవి కిరణ్, మామిడాల బిక్షపతి, గడ్డం విజయకుమార్, ప్రదీప్ కుమార్ లతోపాటు భూనిర్వాసితులు పాల్గొన్నారు.

# తెలుగు భాషకు చార్లెస్ బ్రౌన్ సేవ

పరదేశీయుడైనా, ఆంగ్ల భాష మాతృభాష అయినా, బహు భాషవేత్త అయి ఉండీ, ఈస్ట్ ఇండియా కంపెనీ ఉద్యోగిగా భారత దేశానికి వచ్చి, విధి నిర్వహణ కోసం తెలుగు భాష నేర్చుకుని, నాటికి కరడుగట్టి, మినుకు మినుకుమంటూ, ఆరిపోవడానికి సిద్ధంగా ఉన్న తెలుగు భాష ఉద్ధరణకు బ్రౌన్ తీసుకున్న చొరవ ప్రశంసనీయం. ఆంగ్లేయులు పురాణాలను ప్రచురించడం, వ్యాఖ్యానాలు రాయించడం, తెలుగు నేర్చకోవడం కోసం వాచకాలు, వ్యాకరణ గ్రంథాలు రాయడం, ప్రచురించడం, సహస్రాధిక వేమన పద్యాలను వెలికితీసి ప్రచురించడం, పాఠశాలలు స్థాపించి, ఉచిత విద్య నేర్చుకునే అవకాశం కల్పించడం, ప్రాచీన గ్రంథాలను అర్థం చేసుకోవడానికి ఏకంగా నిఘంటువుని అందించడం ద్వారా తెలుగు భాషా, సాహిత్య వికాసానికి బ్రౌన్ అందించిన సేవ అమోఘం, అపూర్వం, అస మానం అనితర సాధ్యం. చార్లెస్ ఫిలిప్ బ్రౌన్ (నవంబర్ 10, 1798 డిసెంబర్ 12, 1884) తెలుగు సాహిత్యమునకు విశేష సేవ చేసిన ఆంగ్లేయుడు. తొలి తెలుగు శబ్దకోశమును ఆయనే పరిష్కరించి ప్రచురించాడు. బ్రౌన్ డిక్షనరీని ఇప్పటికి తెలుగులో ప్రామాణికంగా ఉపయోగిస్తారు. సి. పి. బ్రౌన్ 1798 నవంబర్ 10న కలకత్తాలో జన్మించాడు. ఈయన తండ్రి డేవిడ్ బ్రౌన్ పేరొందిన క్రైస్తవ విద్వాంసుడు. తండ్రి మరణించిన తరువాత బ్రౌను కుటుంబం ఇంగ్లండు వెళ్ళిపోయింది. తండ్రి ఇచ్చిన స్ఫూర్తితో సీపీ బ్రౌన్ గ్రీక్, లాటిన్, పారశీ, సంస్కృత భాషల్లో ఆరితేరాడు, బ్రౌను అక్కడే హిందూస్థానీ భాష నేర్చుకున్నాడు. తరువాత 1817 ఆగష్టు 4 న మద్రాసులో ఈస్ట్ ఇండియా కంపెనీలో ఉద్యోగంలో చేరాడు. ఉద్యోగ బాధ్యతల్లో భాగంగా మద్రాసులో కోదండరామ పంతులు వద్ద తెలుగులో ప్రాథమిక జ్ఞానాన్ని సంపాదించాడు. 1820 ఆగస్టులో కడపలో డిప్యూటీ కలెక్టరుగా చేరాడు. ఉద్యోగరీత్యా అనేక ప్రాంతాల్లో పని చేసినపుడు తెలుగులో మాట్లాడడం తప్పనిసరి అయింది. అయితే తెలుగు నేర్చుకోడానికి సులభమైన, శాస్త్రీయమైన విధానం లేక పోవడం వలన, పండితులు తమ తమ స్వంత పద్ధతులలో బోధిస్తూ ఉండేవారు. తెలుగేతరులకు ఈ విధంగా తెలుగు నేర్చుకోవడం ఇబ్బందిగా ఉండేది. భాష నేర్చుకోవడం లోని ఇబ్బంది, బ్రౌనును తెలుగు భాషా పరిశోధనకై పురికొల్పింది. ప్రాచీన తెలుగు కావ్యాలను వెలికితీసి, ప్రజలందరికీ అర్థమయ్యేలా పరిష్కరించి, ప్రచురించడం, భాషకు ఓ వ్యాకరణం, ఓ నిఘంటువు, ఏర్పడడానికి దారితీసింది. మచిలీపట్నం, గుంటూరు, చిత్తూరు, తిరునెల్వేలి మొదలైన చోట్ల పనిచేసి, 1826లో మళ్ళీ కడపకు తిరిగి వచ్చి అక్కడే స్థిర నివాస మేర్పరచు కొన్నాడు. కడపలోను, మచిలీపట్నంలోను కూడా పాఠశాలలు పెట్టి ఉచితంగా చదువు చెప్పించాడు. విద్యార్థులకు ఉచితంగా భోజన వసతి కూడా కల్పించాడు. 1834లో ఉద్యోగం నుండి తొలగించడంతో ఇంగ్లండు వెళ్ళిపోయి, తిరిగి 1837లో కంపెనీలో పర్షియను అనువాదకుడిగా భారత దేశానికి వచ్చాడు. 1827 నాటికే, బ్రౌన్ 'ఆంధ్ర గీర్వాణ ఛందము' అనే పుస్తకం రాసినప్పటికీ, ఆయనకి మంచి గుర్తింపు తెచ్చిన పుస్తకం 1829 నాటి 'వేమన శతకం'. అప్పటికి బ్రౌన్ అయిదేళ్లుగా వేమన సాహిత్యాన్ని అధ్యయనం చేస్తూ ఉన్నారు. ఇందులో దాదాపు 700 పద్యాలకు ఆంగ్లాను వాదాలతో పాటు విస్తృతమయిన పదకోశం కూడా సమకూర్చారు. మరో పదేళ్ల తర్వాత, 1164 పద్యాల వరకు విస్తరింపచేసి, తిరిగి 'వేమన శతకం' అచ్చువేశాడు. పదవీ విరమణ తరువాత 1854లో లండన్‌లో స్థిరపడి, 1865లో లండన్ యూనివర్సిటీలో తెలుగు ప్రొఫెసరుగా నియమితుడైనాడు.బ్రౌన్ కొలువులో తొలి తెలుగు కథకుడు తాతాచారి అనే పేరుతో ప్రాచుర్యం పొందిన నేలటూరు వేంకటాచలం. తాతాచారి చెప్పిన కథలను విన్న సి. పి. బ్రౌన్ అందులోంచి 24 కథలను, దానితోపాటు శ్రీకృష్ణమాచారి చెప్పిన రెండు కథలను కలిపి 1855లో పుస్తకంగా ముద్రించారు. 1916లో 'తాతాచారి కథలు ' గిడుగు వేంకట అప్పారావు సంపాదకత్వంలో ద్వితీయ ముద్రణ పొందాయి. 1951లో వావిళ్ల వారి తృతీయ ముద్రణ, 1974లో బంగోరె సంపాదకుడిగా చతుర్థ ముద్రణ పొందాయి. 1848లో చెన్నపట్నం వెళ్లి బ్రౌను కొలువులో ఏడేళ్లు పల్నాటి వీర చరితం, వసు చరిత్ర మొదలైన గ్రంథా ల పరిష్కార కృషిలో ఆయనకు సాయపడ్డారు. తాతాచార్యులు కావ్య తర్క వ్యాకరణముల యందు ప్రవీణత గలవాడు. తాతాచారి కథలు నీతి బోధకాలే కాక, ఆనాటి సామాజిక స్థితికి దర్పణంగాను ఉన్నాయి. అందులోని శైలి శుద్ధ వ్యావహారికం అయిన కారణంగా పండిత శైలికి దూరంగా ఉందనే బ్రౌన్ ప్రశంసకు యోగ్యమైంది. బ్రౌన్ వేమన పద్యాలను వెలికితీసి ప్రచురించాడు. 1829లో 693 పద్యాలు, 1839లో 1164 పద్యాలు ప్రచురించాడు. 1841లో "నలచరిత్ర"ను ప్రచురించాడు."ఆంధ్ర మహాభారతము", "శ్రీమద్భాగవతము" లను ప్రచురించాడు. తెలుగు నేర్చుకునే ఆంగ్లేయుల కొరకు వాచకాలు, వ్యాకరణ గ్రంథాలు రాసాడు. 1840లో వ్యాకరణాన్ని ప్రచురించాడు. లండన్‌లోని "ఇండియాహౌస్ లైబ్రరీ"లో పడి ఉన్న 2106 దక్షిణభారత భాషల గ్రంథాలను మద్రాసు తెప్పించాడు. "హరిశ్చంద్రు నికష్టాలు" గౌరన మంత్రిచే వ్యాఖ్యానం వ్రాయించి 1842లో ప్రచురించాడు. 1844లో "వసుచరిత్ర"', 1851లో "మనుచరిత్ర" ప్రచురించాడు. జూలూరి అప్పయ్య శాస్త్రి చేత వీటికి వ్యాఖ్యానాలు రాయించాడు. 1852లో "పలనాటి వీరచరిత్ర" ప్రచురించాడు. పందొమ్మిదో శతాబ్ది తొలి చివర్లో తాను తెలుగు సాహిత్యంలో కృషి మొదలుపెట్టే నాటికి నెలకొని వుండిన స్థితిగతులను గురించి బ్రౌన్ స్ఫుటమయిన మాటల్లో అభివర్ణించాడు. 'అప్పటికి తెలుగు సాహిత్యం కొనప్రాణంతో కొట్టుకులా డుతోంది. 1825 నాటికి ప్రమిదలో దీపం కొడిగట్టి పోతోంది. తెలుగు సాహిత్యం దాదాపు అంతరించి పోతూ ఉండడం నా కళ్లబడింది. నేను 30 ఏళ్లు కృషి చేసి, దాన్ని పునఃప్రతిష్ట చేశాన'న్నాడు బ్రౌన్. తెలుగు భాషాభివృద్ధికి ఇతోధిక సేవలు అందించి, మరచిపోలేని కృషి సల్పిన బ్రౌన్ 1884 డిసెంబర్ 12 న తన స్వగృహము 22 కిల్డారే గార్డెన్స్, వెస్ట్‌బార్న్ గ్రోవ్, లండన్లో అవివాహితుని గానే బ్రౌన్ మరణించాడు. ఆయనను కెన్సెల్ గ్రీన్ శ్మశానంలో సమాధి చేశారు.

# ఎన్నికల కోడ్ వల్లనే ముఖ్యమంత్రి ఉద్యోగ ప్రకటన చేయలేదు



## ఎస్సి కార్పొరేషన్ మాజీ చైర్మన్ డాక్టర్ పిడమర్తి రవి

**హైదరాబాద్,డిసెంబర్11 (తెలంగాణ ముచ్చట్లు):**

రాష్ట్రంలో స్థానిక సంస్థల (సర్పంచ్)ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో ఎన్నికల కోడ్ అమలులో ఉండటంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆశించిన మెగా ఉద్యోగ ప్రకటన చేయలేకపోయారని ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్,కాంగ్రెస్ నాయకుడు డాక్టర్ పిడమర్తి రవి తెలిపారు.ఉస్మానియా యూనివర్సిటీలో జరిగిన సభలో మాట్లాడిన రవి, నిరుద్యోగ యువత ఆశించిన విధంగా ఉద్యోగ ఉద్యోగ ఇవ్వలేకపోయారని, ఎన్నికల కోడ్ ముగిసిన వెంటనే మెగా ఉద్యోగ ప్రకటనలు వస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు."ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇప్పటికే వేలాది ఉద్యోగాలు భర్తీ చేశారని,నిరుద్యోగ యువత అధైర్యపడాల్సిన అవసరం లేదని,త్వరలో ఉద్యోగ నోటిఫికేషన్లు జారీ చేసేందుకు ముఖ్యమంత్రి సుముఖంగా ఉన్నారు" అని రవి చెప్పారు. ప్రభుత్వం ఇప్పటికే 60,000 ఉద్యోగాలు భర్తీ చేసింది. మరిన్ని 40,000 ఉద్యోగాలు త్వరలో భర్తీ చేసేందుకు ప్రణాళికలు ఉన్నాయి. ఎన్నికల తర్వాత నిరుద్యోగ యువతకు మరిన్ని అవకాశాలు లభిస్తాయని రవి ఆశాభావం వ్యక్తం చేశారు.

**ఓయూకి 1,000 కోట్లు కేటాయింపుపై హర్షం వ్యక్తం చేసిన పిడమర్తి**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉస్మానియా యూనివర్సిటీ అభివృద్ధికి రూ. 1,000 కోట్లు కేటాయించడం పిడమర్తి రవి హర్షం వ్యక్తం చేశారు.ఈ నిధులను ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, ఫ్యాకల్టీ నియామకాలు, సమస్యల పరిష్కారం వంటి అంశాలకు ఈ నిధులు వినియోగిస్తారు నిధులు కేటాయించిన సిఎం రేవంత్ రెడ్డికి పిడమర్తి రవి ధన్యవాదాలు తెలిపారు.

# హైకోర్టులో 12 జడ్జి పోస్టులు ఖాళీ



తెలంగాణ హైకోర్టులో న్యాయమూర్తుల ఖాళీల భర్తీ వ్యవహారంపై కేంద్ర ప్రభుత్వం కీలక స్పష్టత ఇచ్చింది. హైకోర్టుకు మంజూరైన జడ్జి పోస్టులు 42 కాగా, ప్రస్తుతం 12 ఖాళీలు ఉన్న మాట వాస్తవమేనని కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్‌రామ్ మేఘ్వాల్ పార్లమెంట్ వేదికగా అంగీకరించారు. అయితే, ఈ ఖాళీల భర్తీకి సంబంధించి తెలంగాణ హైకోర్టు కొలీజియం నుంచి కేంద్ర ప్రభుత్వానికి ఎలాంటి ప్రతిపాదనలు పెండింగ్‌లో లేవని స్పష్టం చేశారు. రాజ్యసభలో కాంగ్రెస్ ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్ అడిగిన ప్రశ్నకు మంత్రి లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. 2025 డిసెంబర్ 5 నాటికి తెలంగాణ హైకోర్టు నుంచి జడ్జీల నియామకానికి సంబంధించి ఏ ఒక్క ప్రతిపాదన కూడా కేంద్రం వద్ద పెండింగ్‌లో లేదన్నారు. నిబంధనల ప్రకారం ఖాళీ ఏర్పడటానికి 6 నెలల ముందే హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ప్రతిపాదనలు పంపాల్సి ఉంటుంది. కానీ, ఈ గడువు చాలా అరుదుగా మాత్రమే అమలవుతోందని మంత్రి తెలిపారు.

## సౌర విద్యుత్తు ఉత్పత్తిలో సింగరేణి దూకుడు

బొగ్గు ఉత్పత్తిలో 137 ఏళ్ల సుదీర్ఘ అనుభవం గడించిన సింగరేణి సంస్థ, ఇతర ప్రభుత్వరంగ సంస్థలకు ఆదర్శంగా నిలిచేలా ఇతర ఇంధన వనరుల వెలికితీత కోసం ప్రయత్నించడంలో సఫలం అవుతోంది. ఒకవైపు కొత్తగనులు రాక.. ఉత్పత్తి చేసిన బొగ్గు, విద్యుత్తుపై రావాల్సిన బకాయిలు రూ.40 వేల కోట్లకుపైగా పేరుకుపోయి ఇబ్బందులు పడుతోంది. మరోవైపు బంగారం, రాగి గనులతోపాటు, థర్మల్ విద్యుత్తు, సోలార్ విద్యుత్తు ఉత్పత్తి రంగాల్లో ముందుకు దూసుకుపోతోంది. సింగరేణి బొగ్గు గనులు విస్తరించిన ఆరు జిల్లాల్లో ఇప్పటికే 245.5 మెగావాట్ల సౌర విద్యుత్తును ఉత్పత్తి చేస్తోంది. 2016 నుంచి మంచిర్యాల జిల్లా జైపూర్‌లో 1200 మెగావాట్ల విద్యుత్తును ఉత్పత్తి చేస్తూనే, అదే ప్లాంటులో 800 మె.వాట్ల అదనపు యూనిట్ నిర్మాణానికి ఏర్పాట్లు జరుగుతున్నాయి.

## ఉద్యోగాల పేరుతో మోసం.. మహిళ అరెస్టు

అనంత ఈసొల్యూషన్‌లో ఉద్యోగాలంటూ నిరుద్యోగులను మోసం చేసిన కేసులో ఆదిలాబాద్ టూటౌన్ పోలీసులు మరో నిందితురాలు మంజులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. దాదాపు 50 మంది నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ నమ్మించి వారి నుంచి రూ.50 లక్షలకు పైగా నిందితులు వసూలు చేశారు. ఆదిలాబాద్ పట్టణం తిలక్‌నగర్‌కు చెందిన బాధితుడు మెస్రం ఉమేష్ జులైలో పోలీసులకు ఫిర్యాదు చేయగా.. అప్పట్లోనే బోథ్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ కోవ విఠల్‌ను నిందితునిగా గుర్తించి పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు టూటౌన్ ఇన్‌స్పెక్టర్ కె.నాగరాజు తెలిపారు. తాజాగా జనగామ జిల్లాకు చెందిన మరో నిందితురాలు మంజులను అరెస్టు చేసినట్లు పేర్కొన్నారు.

## సేంద్రియ రసాయన శాస్త్రంపై విస్తృత ఉపన్యాసం

ఇచ్చోడయందు ప్రభుత్వ డిగ్రీ కళాశాల రసాయన శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో సేంద్రియ రసాయన శాస్త్రం యొక్క ప్రాథమిక అంశాలు అనే అంశంపై జి సాయి ప్రసాద్, ఉట్నూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల రసాయన శాస్త్ర అధ్యాపకులు, విస్తృత ఉపన్యాసం గురువారం ఇచ్చారు. ముగింపు కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ శ్రీనివాస్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా రసాయన శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ వి సరిత రాణి, విద్యార్థులు, అధ్యాపకులు అతిథిని శాలువతో సత్కరించారు.

## మొదటి విడత పోలింగ్ పక్రియ పరిశీలించిన కలెక్టర్

మొదటి విడత గ్రామపంచాయతీ ఎన్నికల పోలింగ్ ప్రశాంత వాతావరణంలో సజావుగా నిర్వహించబడిందని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ తెలిపారు. గురువారం ఆయన మేడిపల్లి, కోరుట్ల, మెట్ పెల్లి, ఇబ్రహీంపట్నం, మల్లాపూర్ మండలాల్లోని వివిధ పోలింగ్ కేంద్రాలను పరిశీలించి, ఎన్నికల పక్రియను పర్యవేక్షించారు. ఎన్నికలు ఎటువంటి ఆటంకాలు లేకుండా ముగిసినట్లు ఆయన వెల్లడించారు.

# 'ఉపాధి' ఉసురు తీస్తున్న ఎన్‌డిఏ



స్వాతంత్ర్యానంతరం గ్రామీణ పేదల కోసం వచ్చిన అతి కొద్ది చట్టాల్లో ఉపాధి హామీ చట్టం ఒకటి. ఈ చట్టం బాగా అమలు జరిగిన చోట పేదల వలసలు తగ్గాయి. కొనుగోలు శక్తి పెరిగింది. భూస్వామ్య వర్గాలతో పేదలకు బేరమాడే శక్తి వచ్చింది. వెరసి భారత ఆర్థిక వ్యవస్థ కుదేలు కాకుండా కొంత నిలబెట్టగలిగింది. ఈ చట్టం యొక్క ప్రాధాన్యతను భారతదేశంలో అనేకమంది ఆర్థికవేత్తలు, మేధావులు కొనియాడారు. ప్రపంచ బ్యాంకు సైతం ప్రశంసించిందంటే ఈ చట్టం యొక్క ప్రాధాన్యత విదితమవుతుంది. గ్రామీణ పేదలకు పని లేని సమయంలో పని చూపించి పస్తుల నుంచి కాపాడడానికి ఉపాధి హామీ చట్టం దోహదపడింది. మన రాష్ట్రంలో లక్షలాది ఎకరాల సన్న, చిన్నకారు రైతుల భూములు అభివృద్ధి కావడానికి ఉపకరించింది. చదువుకున్న లక్షలాదిమంది యువతీ యువకులకు కొంత ఉపాధి చూపించగలిగింది. ఇంతటి ప్రాధాన్యత కలిగిన చట్టాన్ని మరింత ముందుకు తీసుకెళ్లాల్సిన పాలకులే పీక నొక్కడానికి పూనుకున్నారు.

2005లో చట్టం రూపుదిద్దుకున్నప్పుడు పేదలకు ఉపయోగ పడే అనేక అంశాలను చేర్చారు. గ్రామీణ ప్రాంతంలో నివసించే 18 సంవత్సరాలు నిండిన ఎవరైనా ఈ జాబు కార్డు పొందవచ్చు. కార్డు పొందిన ప్రతి కుటుంబం ఏడాదికి వంద రోజులు పని చేయవచ్చు. చేసిన పనికి వారం వారం వేతనాలు చెల్లించాలి. పనిచేసే చోట మంచి నీళ్లు, నీడ, 5 మంది పిల్లలు ఉంటే %% ఒక ఆయాను ఏర్పాటు చేయాలి. ఆ నియామకంలో ఒంటరి మహిళలకు, వికలాంగులకు ప్రత్యేక ప్రాధాన్యత కల్పించింది. గ్రామీణ ఉపాధి నిధులను 90% వ్యవసాయ కార్మికులకు, 10 శాతం మాత్రమే మెటీరియల్ వర్క్‌కు కేటాయించాలి తప్ప ఎట్టి పరిస్థితుల్లో యంత్రాలను ఉపయోగించరాదు. కాంట్రాక్ట్ విధానం నిషేధం ఈ చట్టాన్ని గడిచిన పదేళ్లుగా ఎన్డీఏ ప్రభుత్వం నీరుగారుస్తూ వచ్చింది. బడ్జెట్లో కేటాయింపులు తగ్గింపు మొదలు అనేక మార్పులు చేర్పులు చేసింది. 10 శాతం ఉన్న మెటీరియల్ కాంపోనెంటును 40 శాతానికి పెంచింది. యంత్రాలు ఉపయోగించరాదన్న రాజీ లేని సూత్రాన్ని ఎత్తేసి యంత్రాలను ప్రవేశపెట్టింది. సిమెంటు రోడ్లు, పక్కా భవనాలు పేరుతో కోట్ల రూపాయలు కాంట్రాక్టర్లు, రాజకీయ నాయకులు దోచుకోవడానికి అవకాశం కల్పించింది. ఈ పనిలో రోజువారీ వేతనం కాకుండా క్యూబిక్ మీటర్ రేటు ప్రకారం (పీస్ రేటు) ఎంత పని చేస్తే అంత వేతనం వచ్చేది. ఎండాకాలంలో నేల గట్టిగా ఉండడం వల్ల 20 నుంచి 40% అదనంగా సమ్మర్ అలవెన్స్ కల్పించి కూలీలకు వేతనాలు గిట్టుబాటు అయ్యేవి. పీస్ రేటు వల్ల కూలీలు తెల్లవారక ముందే ఉపాధి హామీ పనులకు వెళ్లి చేయగలిగినంత చేసి ఇంటికొచ్చిన తర్వాత తమ సొంత పొలంలోనూ లేదా తమ జీవనం కోసం ఇతర పనికి వెళ్లి పొట్ట పోసుకునేవాళ్లు. తద్వారా రెండు రకాల ఉపయోగం జరిగేది. గత మూడేళ్ళుగా మోడీ ప్రభుత్వం గ్రామీణ ఉపాధి హామీకి కేంద్ర బడ్జెట్లో భారీగా నిధులు తగ్గించింది. రూ.194 వేతనాలు ఉన్నప్పుడు కేంద్ర బడ్జెట్లో రూ.80 వేల కోట్ల నుండి లక్ష పది వేల కోట్లు కేటాయించింది. ఆనాడు సుమారుగా ఐదున్నర కోట్ల కుటుంబాలు దేశవ్యాప్తంగా పనిచేశాయి. నేడు రోజు వేతనం మన రాష్ట్రంలో 217 రూపాయలు. ఈ లెక్కన కేంద్ర బడ్జెట్లో సుమారు రెండు లక్షల కోట్లు కేటాయించాలి. కానీ ఈ ఏడాది మరింత తగ్గించి రూ.81 వేల కోట్లకు కుదించారు. ఈ కారణంగా మన రాష్ట్రంలోనే 17 లక్షల కుటుంబాలు సుమారు 3 కోట్ల పనిదినాలను కోల్పోయాయి. గతంలో 100 రోజులు చేసిన కుటుంబాలు 15 శాతం ఉంటే నేడు 4 శాతానికి మించి లేవు. అవినీతి జరుగుతుందనే నెపంతో మన రాష్ట్రంలో 82 లక్షల జాబుకార్డులు ఉంటే గ్రామంలో నివాసం లేరని నెపంతో వలసబోయిన కూలీల కార్డులను, ఏడాదికి పది రోజులు మించి పనిచేయని కూలీల కార్డులను, ఇంకా రాజకీయ కారణాలతోనూ తొలగించింది. సుమారు 40 లక్షల మంది కార్మికులకు పని ఇవ్వకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్డులను రద్దు చేశాయి. దీనివల్ల ఆయా పేద కుటుంబాలు రూ.630 కోట్లను నష్టపోయాయి. ప్రస్తుతం ఉపాధిలో అవినీతి జరుగుతుందనే పేరుతో సుమారు 17 లక్షల 50 వేల కార్డులను తొలగించింది. 2024కు ముందు మన రాష్ట్రంలో 82 లక్షల పైచిలుకు జాబు కార్డులు ఉంటే నేడు 65 లక్షల జాబు కార్డులు ఉన్నాయి. ఇందులో పని కల్పించిన కుటుంబాలు 54 లక్షలు మాత్రమే. ఈ ఏడాది కేంద్ర బడ్జెట్లో 81 వేల కోట్లు కేటాయిస్తే, రూ.20 వేల కోట్లు పాత బకాయిలకు పోగా, మిగిలింది రూ.61 వేల కోట్లు. ఇందులో కూడా రూ.24 వేల కోట్లు మెటీరియల్‌కు పోగా, కూలీలకు మిగిలింది కేవలం 37 వేల కోట్లు. ఈ డబ్బుతో దేశమంతా 4.50 కోట్ల కుటుంబాలకు పని చూపాలి. అంటే కుటుంబానికి 10 రోజులు కూడా పని రాదన్నమాట. కాగా, మన రాష్ట్రంలోనే సుమారు రూ.434 కోట్ల వేతన బకాయిలు ఉన్నాయి. పొమ్మనకుండా పొగ పెట్టినట్టు వ్యవసాయ కార్మికులే ఈ పని మాకొద్దు అనేలా కేంద్ర ప్రభుత్వం కొత్త కొత్త విధానాలు తీసుకొచ్చి ఉపాధి హామీ చట్టానికి ఎసరు పెట్టటానికి పూనుకున్నది. ఉపాధి హామీలో కొత్త విధానాలు తీసుకురావడానికి దేశంలో మూడు జిల్లాలను పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసింది. అందులో మన రాష్ట్రంలోని పార్వతీపురం మన్యం జిల్లా ఉంది. రెండు పూటలా పనిచేయాలని, ప్రతి నాలుగు గంటలకు ఒకసారి హాజరు వేయాలని, పనిచేసే చోట ఫేస్ యాప్ ద్వారా హాజరు తీసుకోవాలని, ఆధార్ కార్డు ద్వారా బ్యాంకుకు ఈ కేవైసీ లింకు చేసి తద్వారా వేతనాలు చెల్లించాలని కొత్త నిబంధనలు రూపొందించారు. ఉపాధి హామీలో ఇచ్చేది రోజు వేతనం కాదుబీ క్యూబిక్ మీటర్ రేటు ప్రకారం (పీస్ రేటు) పని చూపిస్తారు. కాబట్టి పేదలు ఉదయాన్నే పనికి వెళ్లి 11, 12 గంటలకల్లా తమ పని ముగించు కొని ఇంటికి వచ్చి ముద్ద తిని, పశువుల పోషణ వంటి ఇతరత్రా చిన్న చిన్న పనులకు సమయం కేటాయించుకునేవారు. నేడు రెండు పూటలా పని అంటే ఉదయం 6 గంటలకు వెళ్లి 11 గంటలకు తిరిగి రావాలి. మరి 3 గంటలకు వెళ్లి సాయంత్రం 5 గంటలు దాకా పనిచేయాలి. ఉపాధి పనికి వెళ్లాలంటే రెండు నుండి ఐదు కిలోమీటర్లు దూరం వెళ్లాలి. రెండు పూటలు పని చేయాలంటే రోజుకు 10 నుండి 20 కిలోమీటర్లు నడిచి వెళ్లాలి. లేదా ఉదయం ఆరు గంటల నుండి సాయం త్రం ఐదు గంటల దాకా పని ప్రదేశంలోని ఎర్రటి ఎండలో ఉండాలి. ఇంకో పని చేసుకోవడానికి అవకాశం లేదు. పోనీ రెండు పూటలు పనిచేసినా గిట్టుబాటు వేతనం వస్తుందా అంటే అదీ లేదు. రోజుకు రెండుసార్లు ఫేస్ యాప్ ద్వారా హాజరు వేయాలంటే నెట్ సౌకర్యం అందుబాట్లో ఉండాలి. మారుమూల ప్రాంతాల్లో అదెలా సాధ్యం? పనిలోకి వెళ్లినా నెట్‌వర్క్ అందక ఆ రోజు ఆబ్సెంట్ పడుతుంది. కేవైసీ ద్వారా బ్యాంకుకు అనుసంధానం చేయటం కూడా సమస్యే. ఇవన్నీ ఉపాధి చట్టాన్ని నీరు కార్చడంలో భాగమేనని పరిశీలకులు భావిస్తున్నారు. పేదలే ఈ పని మనకు వద్దు అనేలా కొత్త కొత్త నిబంధనలు విధించి చట్టాన్ని రద్దు చేయాలని ఎన్డీఏ ప్రభుత్వం కుట్ర చేస్తోంది. ఇప్పటికే ప్రభుత్వ వెబ్సైట్లో చట్టానికి బదులుగా స్కీమ్ అని పేరు మార్చింది. దీనినిబట్టే ఎన్డీఏ ఉపాధి హామీ చట్టం ఉసురు తీయడానికి సిద్ధంగా ఉన్నట్లు కనిపిస్తోంది. పోరాడి సాధించుకున్న ఈ చట్టాన్ని పోరాడి నిలబెట్టుకోవాల్సిన ఆవశ్యకత ప్రజలపై ఉంది.

# వేతనాల పెంపు కోసం అంగన్‌వాడీల పోరుబాట

అంగన్వాడీ ఉద్యోగులకు వేతనాల పెంపు, గ్రాట్యూటీ, సంక్షేమ పథకాల అమలు, పెండింగ్‌లో ఉన్న మినీ వర్కర్లను మెయిన్ వర్కర్లుగా మార్పు తదితర సమస్యల పరిష్కారానికై డిసెంబర్ 12న సిఐటియు, ఎఐటియుసి, ఐఎఫ్‌టియు మూడు సంఘాల సారథ్యంలో కలెక్టర్ కార్యాలయాల వద్ద ధర్నాలు నిర్వహించాలని నిర్ణయించాయి. 2023 డిసెంబర్ 12న ఈ మూడు అంగన్వాడీ సంఘాల నాయకత్వంలో వేతనాలు పెంపుతో సహా దీర్ఘకాలిక పెండింగ్ సమస్యలపై 42 రోజులపాటు చారిత్రాత్మక సమ్మె జరిగింది. ఆ సమ్మె కాలంలో అప్పటి ప్రభుత్వం అంగన్వాడీల మీద 'ఎస్మా' లాంటి క్రూర చట్టాలను తీసుకొచ్చి ఉక్కుపాదంతో అణచాలని తీవ్ర ప్రయత్నాలు చేసింది. షోకాజ్ నోటీసులు ఇచ్చి వేల మందిని తొలగిస్తున్నామని ప్రకటనలు చేసింది. అయినా అంగన్వాడీల ఐక్యత ముందు అవన్నీ భోగిమంటల్లో కలిసిపోయాయి. తీవ్ర నిర్బంధాలను ఎదిరించి 2024 జనవరి 22 తారీఖున నిర్వహించిన 'చలో విజయవాడ' కార్యక్రమానికి వేలాదిమంది అంగన్వాడీలు హాజరై విజయవాడలో బైఠాయించారు. అప్పటి పోరాట ఫలితంగా మంత్రివర్గంతో జరిగిన చర్చల్లోసందర్భంగా 2024 జులైలో అంగన్వాడీ యూనియన్లతో చర్చించి ఆమోదయోగ్యమైన రీతిలో వేతనాలు పెంచుతామని, మిగిలిన సమస్యలు పరిష్కరిస్తామని రాతపూర్వకంగా మినిట్స్ కాపీ ఇచ్చారు. కానీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత వాటి అమలు గురించి



పట్టించుకోవడం లేదు. సమ్మె సమయంలో ప్రతిపక్షంలో ఉన్న టిడిపి, కూటమి నాయకత్వం అంగన్వాడీల సమ్మెను బలపరిచారు. ఆ డిమాండ్లు న్యాయమైనవని ప్రకటించారు. తాము అధికారంలోకి వస్తే వేతనాల పెంపు, గ్రాట్యూటీ, అమలు తదితర సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. మినీ వర్కర్స్ సమస్యలు, మట్టి ఖర్చులు జిఓ లాంటి కొన్ని సమస్యలు పరిష్కారం అయినా వేతనాల పెంపు గురించి పట్టించుకోవడం లేదు.

2019 నుండి అంగన్వాడీలకు వేతనాలు పెరగలేదు. ఈ కాలంలో నిత్యవసర సరుకుల ధరలు, విద్యా, వైద్యం ఖర్చులు విపరీతంగా పెరిగాయి. పని భారం పెరిగింది. అంగన్వాడీ సెంటర్ నిర్వహణకు రకరకాల యాప్‌లు తీసుకొచ్చి పని భారం పెంచారు. మరోవైపు కొన్ని జిల్లాల్లో (గుంటూరు, పల్నాడు, అనంతపురం, శ్రీకాకుళం) రాజకీయ వేధింపులు వలన కొంతమంది అంగన్వాడీలను అక్రమంగా తొలగిస్తున్నారు. కొన్నిచోట్ల ప్రజా ప్రతినిధులు మా వాళ్ళని పెట్టుకోవాలని పేరుతో అధికారుల ద్వారా అక్రమ 'మెమో'లు ఇస్తున్నారు. ఇటీవల సత్యసాయి జిల్లాలో సెంటర్లో ఉన్న హెల్పర్‌ను జుట్టు పట్టుకొని లాగి కొట్టిన ఘటనలు నేటికీ కొనసాగుతున్నాయి. ప్రభుత్వం ఇచ్చిన ఫోన్లు పనిచేయకపోయినా కేంద్ర ప్రభుత్వం పెట్టిన పోషణ ట్రాకర్ యాప్, రాష్ట్ర ప్రభుత్వం బాల సంజీవని యాప్‌లన్ని అమలు చేయాలని ఒత్తిడి పెంచారు. ప్రభుత్వానికి ఎన్నిసార్లు ఫోన్లు పనిచేయట్లేదు, యాప్‌లు పనిచేయటం కష్టంగా ఉందని తెలియజేసినా ఫలితం లేదు. ఆగస్టు నెలలో పాత మొబైల్స్ వాడకుండా ఆన్లైన్ వర్క్ బంద్ చేసి నిరసన తెలియజేశాం. ఫలితంగా 4,687 మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్చుతూ జిఓ సాధించడంతోపాటు, కొత్త మొబైల్స్ ఇస్తామని హామీ ఇచ్చారు. అంగన్వాడీలకు వేతనాలు పెంపు, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యూటీ, సంక్షేమ పథకాలు అమలు రకరకాల యాప్‌లు వంటి సమస్యలు ఇంకా పెండింగ్‌లోనే ఉన్నాయి. వాటిని సాధించుకునేందుకు మూడు అంగన్వాడీ సంఘాలు మరోసారి ఐక్య ఉద్యమానికి సిద్ధం అవుతున్నాయి. అందులో భాగంగా 2023 డిసెంబర్ 12న సమ్మె ప్రారంభించిన రోజును 2025 డిసెంబర్ 12న ఒక రోజు సమ్మె చేస్తూ అన్ని జిల్లాల్లో కలెక్టరేట్ల వద్ద ధర్నాలకు పిలుపునిచ్చాయి. కేంద్రంలో మోడీ ప్రభుత్వం చెబుతున్న వికసిత భారత్, విశ్వగురు, 'బేటీ బచావో బేటీ పడావో' ఇవన్నీ నినాదాలకే పరిమితమైనవి. భారతదేశంలో 0 నుండి 6 సంవత్సరాల లోపు పిల్లలు 37 శాతం మంది ఎదుగుదల లోపంతో ఉన్నారు. 17 శాతం మంది పిల్లలు తక్కువ బరువుతో ఉన్నారు. భారతదేశంలో ప్రతి సంవత్సరం ఆహారం అందక 5 సంవత్సరాలలోపు పిల్లలు 8.8 లక్షల మంది మరణిస్తున్నారు. మాతృ మరణాలు, శిశుమరణాలు తగ్గించడంలో అనుబంధ పోషకాహారం అందించడంలో ప్రీ స్కూల్ విద్య అందించడంలో ప్రాధాన్యత కలిగిన ఐసిడిఎస్‌కు కేంద్ర ప్రభుత్వం రూ.21,960 కోట్లు కేటాయించింది. 2017 నుండి అనుబంధ పోషకాహారానికి నిధులు పెరగలేదు. ఆహార భద్రతకు, ఉపాధి హామీ పథకానికి నిధులు తగ్గించేశారు. నిధులు కొరత వలన లబ్ధిదారుల లిస్టులు తగ్గించే ప్రయత్నాలను అడ్డుకోవటానికి ప్రజలను సమీకరించి పోరాడుతుంది. పని భారాలు, యాప్‌ల ఒత్తిళ్లతో అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్లు మానసిక ఒత్తిళ్లకు గురౌతున్నారు. రకరకాల అనారోగ్యాల పాలౌతున్నారు. ఇటీవల ఏలూరు జిల్లాలో సెంటర్లోనే ఉన్న వర్కర్కు హార్ట్ స్ట్రోక్ వచ్చి సెంటర్లోనే చనిపోయింది. కర్నూలు జిల్లా కలెక్టరు గారు పిచ్చుక మీద బ్రహ్మాస్త్రం లాగా చిన్న పొరపాట్లకి టెర్మినేషన్ ఆర్డర్ ఇస్తున్నారు. ప్రకాశం జిల్లా ఐసిడిఎస్ పీడీ గారు అసలు అంగన్వాడీ సమస్యలు వినటానికి గాని, అర్జీ తీసుకోవటానికి కూడా సిద్ధపడట్లేదు. హెల్పర్ల ప్రమోషన్లు నిర్దిష్టమైన గైడ్‌లైన్స్ రూపొందించాలని ఎన్నిసార్లు ప్రభుత్వానికి మొరపెట్టుకున్నా చెవిటి వాళ్ళ ముందు శంఖం ఊదినట్లు ఉంది. దీనివలన రాష్ట్ర వ్యాప్తంగా నంద్యాల, అనంతపురం తదితర జిల్లాల్లో అర్హత కలిగిన హెల్పర్లకు ప్రమోషన్లు ఇవ్వలేదు. రాజకీయ నాయకుల ఒత్తిడితో అనర్హులకు ప్రమోషన్లు ఇస్తున్నారు. ఈ చర్యలను ఆపాలి. అంగన్వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, కనీస వేతనాలు 26 వేల రూపాయలు ఇవ్వాలని, మిగిలిన 1,810 మినీ సెంటర్లను క్వాలిఫికేషన్ రిలాక్సేషన్ ఇచ్చి మెయిన్ సెంటర్లుగా మార్చాలని, కార్మికులు నష్టదాయకమైన కార్మిక కోడ్లు రద్దు చేయాలని, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యూటీ జిఓ మార్పు చేసి తక్షణమే అమలు చేయాలని, రకరకాల యాప్‌లు రద్దు చేసి ఒకే యాప్‌ను మాత్రమే వినియోగించాలని, నాణ్యమైన 5జి ఫోన్ ఇవ్వాలని, లబ్ధిదారులకు నాణ్యమైన సరుకులు అందించాలని, అంగన్వాడీ సెంటర్ల అద్దెలు సకాలంలో చెల్లిస్తూ, ఉచితంగా వంట గ్యాస్ అందించాలన్నవి ప్రధాన డిమాండ్లు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్: పొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

## కోకా-కోలా కంపెనీ కొత్త సీఈవోగా హెన్రిక్ బ్రాన్..



వరల్డ్ ఫేమస్ బేవరేజ్ దిగ్గజం ది కోకాకోలా కంపెనీ కొత్త సీఈవోగా హెన్రిక్ బ్రాన్ నియమితులయ్యారు. ఈ మేరకు బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్ సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. ప్రస్తుతం హెన్రిక్ బ్రాన్ ఇదే కంపెనీలో ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ మరియు చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. 1996లో కోకాకోలా కంపెనీలో చేరిన హెన్రిక్ బ్రాన్ లాటిన్ అమెరికా, బ్రెజిల్, గ్రేటర్ చైనా, సౌత్ కొరియా వంటి ప్రాంతాల్లో అనేక కీలక పదవుల్లో కొనసాగారు. కంపెనీ గ్లోబల్ ఆపరేషన్స్‌ను కూడా పర్యవేక్షించిన అనుభవం ఆయనకు ఉంది. ప్రస్తుత సీఈవో జేమ్స్ క్విన్సీ 2017 నుంచి కంపెనీని నడిపిస్తూ, జీరోషుగర్ పానీయాలు, ఆరోగ్యకరమైన ఆప్షన్లపై దృష్టి సారించి కంపెనీని 'టోటల్ బెవరేజ్ కంపెనీ'గా మార్చారు. ఆయన హయాంలో కంపెనీ స్టాక్స్ 63 శాతం పెరిగాయి. ఇక 2026 మార్చి 31 నుంచి జేమ్స్ క్విన్సీ కోకాకోలా ఎగ్జిక్యూటివ్ చైర్మన్‌గా కొనసాగనున్నారు. ప్రపంచవ్యాప్తంగా గ్రోత్ అవకాశాలు అన్వేషించడం, కస్టమర్ అవసరాలకు తగ్గట్టు ప్రొడక్ట్స్ రూపొందించడం, టెక్నాలజీని ఉపయోగించి బిజినెస్ పెర్ఫార్మెన్స్ పెంచడం వంటి సవాళ్లు కొత్త సీఈవో హెన్రిక్ బ్రాన్‌పై ఉన్నాయి.

## అదిరిపోయే ఫీచర్లతో కియా సెల్టోస్ రూ. 25 వేలతో బుక్ చేసుకోవచ్చు




కస్టమర్ల అభిరుచులకు అనుగుణంగా.. దిగ్గజ కార్ల తయారీ కంపెనీలు పోటాపోటీగా కొత్త కొత్త మోడళ్లను లాంచ్ చేస్తూనే ఉన్నాయి. ఇటీవల మిడ్ సైజ్ ఎస్‌యూవీ సెగ్మెంట్‌లో విపరీతమైన పోటీ నెలకొంది. ఈ క్రమంలోనే ప్రముఖ కార్ల తయారీ సంస్థ కియా.. భారత్‌లోకి తన రెండో తరం సెల్టోస్‌ను తీసుకొచ్చింది. అత్యాధునిక హంగులతో.. సరికొత్త ఫీచర్లతో ఎన్నో మార్పులు చేసి 2026 మోడల్ సెల్టోస్‌ను ఆవిష్కరించింది. దీని గురించి ఇప్పుడు నెటిజన్లు ఆరా తీస్తున్నారు. ఫీచర్లు, బుకింగ్స్, రిలీజ్ డేట్, ధర గురించి వెతుకుతున్నారు. ఈ కారు ధర ఇప్పటివరకు వెల్లడించలేదు. వచ్చే ఏడాది జనవరి 2న ప్రకటించనుంది. డిసెంబర్ 11 నుంచే బుకింగ్స్ ప్రారంభం కానున్నాయి. ఇక్కడ రూ. 25 వేలు చెల్లించి కారును బుక్ చేసుకోవచ్చు. కొత్త తరం సెల్టోస్.. టాటా సియారాతో పాటు మారుతీ సుజుకీ గ్రాండ్ విటారా, హ్యుందాయ్ క్రెటా, టయోటా అర్బన్ క్రూయిజర్ హైర్డర్, హోండా ఎలివేట్ వంటి మోడళ్లకు గట్టి పోటీనివ్వనుందని చెప్పొచ్చు. కొత్త వెర్షన్ సెల్టోస్‌లో.. ఎన్నో మార్పులు, అప్డేట్స్ ఉన్నాయి. కియా గ్లోబల్ మోడల్స్ డిజైన్‌ను అనుసరిస్తూనే.. కొత్త సెల్టోస్‌లో ఎన్నో మార్పులు చేశారు. కియా సెల్టోస్ ఎక్స్‌టీరియర్ విషయానికి వస్తే.. కొత్త 18 అంగుళాల అల్లాయ్ వీల్స్, కనెక్టెడ్ టెయిల్ లైట్స్, నవీకరించిన టెయిల్‌గేట్ డిజైన్‌ను కలిగి ఉంది. టైగర్ నోజ్ గ్రిల్‌తో పాటు వర్టికల్ లైటింగ్ ఎలిమెంట్స్ ఉన్నాయి. వెనుకవైపు గన్‌మెటల్ ఫినిష్ స్కిడ్ ప్లేట్లతో బంపర్స్ ఉన్నాయి. ఇతర ప్రత్యేకతల విషయానికి వస్తే.. ఇంటిగ్రేటెడ్ రియర్ స్పాయిలర్, షార్క్ ఫిన్ యాంటెన్నా, పనోరమిక్ సన్‌రూఫ్ ఉన్నాయి. కలర్స్ విషయానికి వస్తే.. 10 బాడీ పెయింట్ ఆప్షన్లలో తెచ్చారు. మార్నింగ్ హేజ్, మాగ్మా రెడ్ ఇందులో కొత్తవి. ఈ మిడ్ సైజ్ ఎస్‌యూవీ సెగ్మెంట్లో అత్యంత పొడవైన కారు ఇదేనని కంపెనీ చెబుతోంది. 4,460 మి.మీ.గా ఉందని పేర్కొంది. వెడల్పు 1830 మి.మీ.. ఎత్తు 1635 మి.మీ.గా ఉంది. వీల్ బేస్ 80 మి.మీ. పెరిగి 2690 మి.మీతో వస్తుంది. వీల్ బేస్ పెరగడం వల్ల లెగ్‌రూమ్ కూడా పెరిగింది. క్యాబిన్ డిజైన్ కూడా సరికొత్తగా అప్డేట్ చేశారు. ఇంటీరియర్‌లో.. డిస్‌ప్లే విషయానికి వస్తే 12.3 అంగుళాల డిజిటల్ ఇన్‌స్ట్రుమెంట్ క్లస్టర్, 12.3 అంగుళాల %ణ% టచ్ స్క్రీన్‌తో సింగిల్ ప్యాలెన్ విజువల్ కమాండ్ సెంటర్ ఉన్నాయి. ప్రత్యేకతలు చూస్తే.. ఫ్రంట్ వెంటిలేటెడ్ సీట్స్, 64 కలర్ యాంబియెంట్ మూడ్ లైటింగ్ ఉన్నాయి. భద్రతా పరంగా చూస్తే.. 6 ఎయిర్ బ్యాగ్స్‌తో పాటు హిల్ స్టార్ట్ అసిస్ట్, ప్రతి వీల్‌కు డిస్క్ బ్రేక్స్, 360 డిగ్రీ కెమెరా వంటివి ఉన్నాయి. కొత్త సెల్టోస్ 3 ఇంజిన్ ఆప్షన్లతో వస్తుంది.

# భారత జీడీపీ వృద్ధి అంచనాలను పెంచిన ఆసియా అభివృద్ధి బ్యాంకు




ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి భారత వృద్ధి అంచనాలను సవరిస్తున్నట్టు ఆసియా అభివృద్ధి బ్యాంకు (ఏడీబీ) బుధవారం ప్రకటనలో వెల్లడించింది. ఇటీవల కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన జీఎస్టీ 2.0 సంస్కరణలు, ఫలితంగా పెరిగిన దేశీయ వినియోగం కారణంగా దేశ జీడీపీ మెరుగుపడిందని ఏడీబీ అభిప్రాయపడింది. అందుకే 202526లో దేశ జీడీపీని గతంలో అంచనా వేసిన 6.5 శాతం నుంచి 7.2 శాతానికి పెంచుతున్నట్టు పేర్కొంది. భారత్ వేగవంతమైన వృద్ధి కారణంగా మొత్తం ఆసియా ప్రాంత వృద్ధి కూడా గతంలో అంచనా వేసిన 4.8 శాతం నుంచి 5.1 శాతం పెరిగేందుకు సహాయపడుతుంది. మరోవైపు భారత్ రెండో త్రైమాసికంలో గణనీయంగా వృద్ధిని నమోదు చేసింది. అంతకుముందు తొలి త్రైమాసికంలో 7.8 శాతం వృద్ధి సాధించిన తర్వాత రెండో త్రైమాసికంలో ఆరు త్రైమాసికాల గరిష్ఠం 8.2 శాతానికి పెరిగింది. ఫలితంగా ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ప్రథమార్థంలో భారత్ 8 శాతం వృద్ధి రేటును సాధించింది. ఇందుకు ప్రధానంగా తయారీ, సేవల రంగాల విస్తరణ, సరఫరా, డిమాండ్ పెరగడం, వినియోగం, పెట్టుబడులు బలంగా ఉండటం వల్లనే ఈ వృద్ధి జరిగిందని ఏడీబీ తెలిపింది. కేంద్ర ప్రభుత్వం మూలధన వ్యయం తగ్గడం, ఎంపిక చేసిన భారతీయ ఎగుమతులపై అమెరికా టారిఫ్ పెరగడం వల్ల ఎగుమతులు తగ్గాయి. ఫలితంగా ద్వితీయార్థంలో వృద్ధి నెమ్మదించే అవకాశం ఉందని ఏడీబీ వివరించింది. కానీ, ఊహించిన దానికంటే అధిక వినియోగ డిమాండ్, బలమైన గ్రామీణ ఆర్థిక వ్యవస్థ, జీఎస్టీ రేట్ల కోత ప్రభావం, స్థిరమైన క్రెడిట్ వృద్ధి జీడీపీకి దోహదపడుతుందని పేర్కొంది.

# విమానాల రద్దుతో ఇండిగోకు రూ. 1,800 కోట్ల నష్టం




దేశీయ విమానయాన సంస్థ ఇండిగో ఇటీవల రోజుకు వందల విమానాలను రద్దు చేస్తున్న సంగతి తెలిసిందే. దీని ఫలితంగా కంపెనీ మూడో త్రైమాసికానికి సంబంధించి బ్యాలెన్స్ షీట్‌లో భారీ ఆర్థిక నష్టాన్ను ఎదుర్కోనుంది.ఇప్పటికే విమానాల రద్దు వల్ల ఇండిగోకు రూ. 1,800 కోట్ల నష్టం వాటిల్లింది. ఇది ఇంకా పెరిగే అవకాశం ఉన్నట్టు సమాచారం. డిసెంబర్ 9 వరకు టిక్కెట్ల రద్దు కారణంగా ఎయిర్‌లైన్‌కు ఇప్పటికే వచ్చిన తక్షణ నష్టం రూ. 900 కోట్లకు పైగా ఉంది. ఇది టిక్కెట్ల రద్దు కారణంగా ప్రయాణికులకు తిరిగి చెల్లించింది. అయితే, విమానాల ఆలస్యం కారణంగా రద్దు చేయాల్సిన టిక్కెట్లకు పరిహారం చెల్లించాల్సి వస్తే ఈ ఆర్థిక భారం మరింత పెరుగుతుంది. ఎయిర్‌లైన్ తాజా వివరాల ప్రకారం, డిసెంబర్ 19 తేదీల మధ్య కాలానికి కంపెనీ 8.86 లక్షల పీఎన్‌ఆర్‌లను రద్దు చేసింది. పౌర విమానయాన మంత్రిత్వ శాఖ ప్రయాణీకుల చార్టర్ ప్రకారం, 2 గంటల కంటే ఎక్కువసేపు ప్రయాణించే విమానాన్ని రద్దు చేసి, 24 గంటల ముందు ప్రయాణీకుడికి సమాచారం ఇవ్వకపోతే ఎయిర్‌లైన్ రూ. 10,000 లేదా ప్రాథమిక ఛార్జీతో పాటు ఎయిర్‌లైన్ ఇంధన ఛార్జీ ఏది తక్కువైతే అది పరిహారంగా చెల్లించాలి. చార్టర్ ప్రకారం, ఇండిగో ఇప్పటికే డిసెంబర్ 9 వరకు రూ. 886 కోట్లకు పైగా చెల్లించాల్సి ఉంది. కాబట్టి, ఇండిగో చెల్లించాలని ఆదేశాలు జారీ అయితే వాపసు, పరిహారం విలువ దాదాపు రూ. 1,800 కోట్లు అవనుంది. అయితే, తక్కువ విమాన సమయానికి పరిహారం తక్కువగా ఉండటం వల్ల వాస్తవంలో చెల్లింపు మొత్తంలో వ్యత్యాసం ఉండవచ్చు.

# ఆర్బీఐ సేవింగ్స్ బాండ్లు.. బ్యాంక్ డిపాజిట్లకు మించి వడ్డీ




రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా డిసెంబర్ 5న రెపో రేటును 25 బేసిస్ పాయింట్లు తగ్గించింది. దీంతో ప్రస్తుతం వడ్డీ రేటు 5.25 శాతంగా ఉంది. ఈ ఏడాదిలోనే ఇప్పటి వరకు 4 సార్లు రెపో రేట్లు తగ్గించగా.. 6.50 శాతం నుంచి ప్రస్తుత స్థాయికి చేరింది. ఇదే క్రమంలో బ్యాంకులు లోన్ వడ్డీ రేట్లను తగ్గిస్తుండగా.. తమపై భారాన్ని తగ్గించుకునేందుకు బ్యాంకులు ఫిక్స్‌డ్ డిపాజిట్లపైనా వడ్డీ రేట్లను తగ్గిస్తున్నాయి. ఈ ఏడాది ఆరంభంలో ఎఫ్‌డీలపై ఆకర్షణీయ స్థాయిలో వడ్డీ రేట్లు ఉండేవి. ఆర్బీఐ రెపో రేటు కోతతో అంతే మేర తగ్గుతూ వచ్చాయి. తాజా రేట్ల కోతతో.. బ్యాంకులు డిపాజిట్ రేట్లను ఇంకా తగ్గిస్తాయి. ఇవి ఆల్ టైమ్ కనిష్ఠాలకు పడిపోయే ప్రమాదం ఉంది.

ఈ క్రమంలోనే ఎఫ్‌డీలకు ప్రత్యామ్నాయంగా రిస్క్ లేని పెట్టుబడుల కోసం జనం చూస్తున్నారు. ప్రస్తుతం చాలా బ్యాంకులు ఫిక్స్‌డ్ డిపాజిట్లపై వడ్డీ రేట్లు గరిష్ఠంగా 7.50 శాతం వరకే ఉన్నాయి. కొన్ని స్మాల్ ఫైనాన్స్ బ్యాంకులే కాస్త ఎక్కువ అందిస్తున్నాయని చెప్పొచ్చు. ఇక్కడ దీనికి ప్రత్యామ్నాయంగా రిస్క్ లేని పెట్టుబడి పథకం.. ప్రభుత్వ హామీతో గ్యారెంటీ రిటర్న్స్ అందించే స్కీమ్ ఒకటి ఉంది. అదే ఆర్బీఐ ఫ్లోటింగ్ రేట్ సేవింగ్స్ బాండ్స్. ఈ స్కీమ్ విషయానికి వస్తే ఆర్బీఐ అందించే సురక్షితమైన పథకం. ఇక్కడ వడ్డీ రేటు ప్రస్తుతం 8.05 శాతంగా ఉంది. ఈ వడ్డీ రేటు పోస్టాఫీస్ పొదుపు పథకం నేషనల్ సేవింగ్స్ సర్టిఫికెట్‌కు లింక్ అయి ఉంటుంది. ఆ స్కీమ్ వడ్డీ రేటుపై అదనంగా 0.35 శాతం వడ్డీ వస్తుంది. చీ• వడ్డీ రేటు ప్రస్తుతం 7.70 శాతంగా ఉండగా.. ఆర్బీఐ బాండ్లలో 7.70o0.35= 8.05 శాతం వడ్డీ వస్తుందన్నమాట. ఆర్బీఐ ఈ బాండ్ వడ్డీ రేట్లను ప్రతి 6 నెలలకు ఓసారి సవరిస్తుంది. జనవరి 1, జులై 1 న కొత్త రేట్లను ప్రకటిస్తుంది. అప్పుడు కూడా చీ• వడ్డీ రేట్లపైనే ఆధారపడి ఉంటుంది. ఈ బాండ్ల కాల పరిమితి 7 సంవత్సరాలుగా ఉంది. కనీసం రూ. 1000 తో చేరొచ్చు. గరిష్ట పరిమితి లేదు. ఎంతైనా పెట్టుబడి పెట్టొచ్చు. వడ్డీ ప్రతి 6 నెలలకు ఓసారి జమవుతుంది. ఇక్కడ రాబడి పన్ను పరిమితులకు లోబడి ఉంటుంది. ప్రభుత్వ మద్దతు ఉంటుంది కాబట్టి.. ఎలాంటి రిస్క్ ఉండదు. నిర్దిష్ట వడ్డీ రేటు ప్రకారం కచ్చితమైన ఆదాయం పొందొచ్చు. భారత నివాసితులు ఎవరైనా ఇన్వెస్ట్ చేయొచ్చు. మైనర్ పేరిట గార్డియన్ ఖాతా తెరవొచ్చు. ఎన్‌ఆర్‌ఐలకు అవకాశం లేదు. అయితే ఏడేళ్ల పాటు డబ్బులు వద్దనుకున్న వారికే ఈ స్కీమ్ బెస్ట్ ఆప్షన్ అని చెప్పొచ్చు. కాల పరిమితి లోపు తీసుకునేందుకు వీలుండదు. సీనియర్ సిటిజెన్లకు షరతులకు లోబడి.. కొంత పెనాల్టీతో ముందుగా తీసుకునేందుకు వీలుంటుంది. ఇక్కడ కూడా నాలుగేళ్ల తర్వాతే అవకాశం ఉంటుంది. ఆర్బీఐ గుర్తింపు పొందిన బ్యాంకుల్లో ఈ బాండ్లను కొనుగోలు చేయొచ్చు. ఆధార్, పాన్ కార్డ్, అడ్రస్ ప్రూఫ్ కేవైసీ కోసం కావాలి. ఇంకా ఆర్బీఐ రిటైల్ డైరెక్ట్ పోర్టల్, బ్యాంక్ వెబ్‌సైట్ల ద్వారా కూడా ఆన్‌లైన్ ద్వారా ఇందులో చేరేందుకు అవకాశం ఉంది.

## టేక్‌హోమ్ శాలరీపై ఎఫెక్ట్.. కార్మిక శాఖ క్లారిటీ

పాత కార్మిక చట్టాల స్థానంలో కేంద్ర ప్రభుత్వం నాలుగు కొత్త లేబర్‌కోడ్‌లను తీసుకొచ్చింది. వీటివల్ల చాలా మందికి చేతికందే వేతనం తగ్గుతుందన్న (టేక్‌హోమ్ శాలరీ) ప్రచారం ఊపందుకుంది. దీనిపై తాజాగా కేంద్ర కార్మిక శాఖ వివరణ ఇచ్చింది. టేక్‌హోమ్ శాలరీపై ఎలాంటి ప్రభావమూ పడబోదని తెలిపింది. సీటీసీలో బేసిక్ శాలరీ 50 శాతానికి పెరిగినా, అలవెన్సుల్లో కోత పడుతుందే తప్ప చేతికందే వేతనంపై ఎలాంటి ప్రభావమూ ఉండబోదని స్పష్టంచేసింది. కొత్త లేబర్ కోడ్స్ వల్ల ఉద్యోగుల చేతికందే వేతనంలో ఎలాంటి మార్పూ ఉండబోదని కార్మిక శాఖ తాజాగా ఎక్స్ వేదికగా పోస్ట్ చేసింది. ప్రావిడెంట్ ఫండ్ చట్టబద్ధ వేతన పరిమితి రూ.15 వేలుగా ఉండడమే దీనికి కారణమని తెలిపింది. ఈ పరిమితిపై కొత్త లేబర్ కోడ్‌ల ప్రభావం ఉండబోదు కాబట్టి చేతికందే వేతనంలో ఎలాంటి మార్పూ ఉండబోదని స్పష్టంచేసింది. ఆ పరిమితికి మించి కాంట్రిబ్యూట్ చేయడమనేది స్వచ్ఛందమని, తప్పనిసరి కాదని తెలిపింది. దీన్ని ఓ ఉదాహరణతో వివరించింది.అనే వ్యక్తికి నెలకు రూ.60వేలు వేతనం అనుకుందాం. పాత కార్మిక చట్టాల ప్రకారం.. బేసిక్+ డీఏ భాగం రూ.20వేలు. అలవెన్సులు రూ.40 వేలు అందుతున్నాయి. అదే వ్యక్తి జీతంపై చట్టబద్ధ ఈపీఎఫ్ పరిమితి కింద ఉద్యోగి వాటా రూ.1800, యజమాని వాటా రూ.1800గా ఉంటుంది. అలాంటప్పుడు టేక్ హోమ్ శాలరీ రూ.56,400గా అందుతుంది. లేబర్ కోడ్‌ల అమలు తర్వాత కూడా ఈపీఎఫ్ గరిష్ఠ వేతన పరిమితిలో ఎలాంటి మార్పూ ఉండదు కాబట్టి అంతేమొత్తం వేతనంగా అందుతుందని స్పష్టంచేసింది. రూ.15 వేల వేతన పరిమితి అనేది తప్పనిసరిగా కంపెనీలు అమలు చేయాల్సిన పరిమితి అని కార్మిక శాఖ స్పష్టంచేసింది. కొత్త కార్మిక కోడ్‌లలో దీంట్లో ఎలాంటి మార్పూ లేదని స్పష్టంచేసింది. ఉద్యోగి, యజమాని పరస్పర అంగీకారంతో కావాలంటే పరిమితికి మించి కాంట్రిబ్యూట్ చేయొచ్చని పేర్కొంది. పరిమితి పెంచుకోవాలా వద్దా అనేది ఉద్యోగి, యజమానికి వదిలేసినట్లు కార్మిక శాఖ స్పష్టంచేసింది. అయితే, గ్రాట్యుటీ, లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్ వంటి విషయాల్లో టేక్‌హోమ్ శాలరీపై ప్రభావం ఉండొచ్చని ఆర్థిక నిపుణులు చెబుతున్నారు.

తెలంగాణ TELANGANA MUCHATLU ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక



# డయాబెటిస్ ఉన్నవారు స్వీట్ పొటాటో తినొచ్చా!



చిలగడదుంపలు వాటి గొప్ప పోషక విలువల కారణంగా చాలా ఆరోగ్యకరమైనవిగా పరిగణిస్తారు. అవి ఫైబర్, విటమిన్లు విటమిన్లు , , దీ% వంటివి ఖనిజాలు పొటాషియం, మాంగనీస్ వంటివి అద్భుతమైన మూలం. దీర్ఘకాలిక వ్యాధులకు దారితీసే ఫ్రీ రాడికల్స్ వల్ల కలిగే నష్టం నుండి శరీరాన్ని రక్షించడంలో సహాయపడే యాంటీఆక్సిడెంట్లు కూడా వీటిలో ఉన్నాయి. చిలగడదుంపలు కాన్వోల్వులేసి కుటుంబానికి చెందిన వేరు కూరగాయలు. ఇవి తీపి, పిండి రుచిని కలిగి ఉంటాయి. నారింజ, ఊదా రంగులో ఉంటాయి. వాటి బయటి చర్మం గోధుమ నుండి ఊదా రంగు వరకు ఉంటుంది. చిలగడదుంపలు వాటి గొప్ప పోషక విలువల కారణంగా చాలా ఆరోగ్యకరమైనవిగా పరిగణిస్తారు. అవి ఫైబర్, విటమిన్లు విటమిన్లు , , దీ6 వంటివి ఖనిజాలు పొటాషియం, మాంగనీస్ వంటివి అద్భుతమైన మూలం. దీర్ఘకాలిక వ్యాధులకు దారితీసే ఫ్రీ రాడికల్స్ వల్ల కలిగే నష్టం నుండి శరీరాన్ని రక్షించడంలో సహాయపడే యాంటీఆక్సిడెంట్లు కూడా వీటిలో ఉన్నాయి. అయితే, డయాబెటిస్ ఉన్నవారు చిలగడ దుంప తింటే ఏమౌతుందో తెలుసా..? విటమిన్ ఏ పుష్కలంగా లభించే ఈ చిలగడదుంపల్లో మెగ్నీషియం, విటమిన్ సీతోపాటు, అధిక ఫైబర్, తక్కువ కొవ్వు , కేలరీలతో నిండి ఉంటుంది. చిలగడదుంపల్లో గ్లైసెమిక్ ఇండెక్స్ తక్కువగా ఉంటుంది. ఇందులోని పీచు రక్తంలోని చక్కెర స్థాయిలను కంట్రోల్ చేస్తుంది. జీర్ణక్రియని మెరుగ్గా చేస్తుంది. చిలగడదుంపలు మన శరీరానికి అవసరమయ్యే ముఖ్యమైన విటమిన్లతో నిండి ఉన్నాయి. చిలకడదుంపలు డైటరీ ఫైబర్ ను అధిక మొత్తంలో కలిగి ఉంటాయి. జీర్ణవ్యవస్థ ఆరోగ్యాన్ని కాపాడుకోవడంలో ఇది చాలా కీలక పాత్ర పోషిస్తుంది. ప్రేగు కదలికలను మృదువుగా చేసి మలబద్ధకాన్ని సమర్థవంతంగా నివారిస్తుంది. బరువు తగ్గడానికి సహాయపడుతుంది. రక్తంలో చక్కెర స్థాయిలలో క్రమంగా పెంచుతుంది. మధుమేహ వ్యాధిగ్రస్తులకు బెస్ట్ ఫుడ్‌గా కూడా స్వీట్ పోటాలో తీసుకోవచ్చు. ఇందులో ఉండే ఫైబ్రినోజేన్ కూడా రక్త గడ్డకట్ట కుండా సహాయపడుతుంది. అలాగే ఈ దుంపలలోని అధిక స్థాయి పొటాషియం హార్ట్ బీట్‌ను క్రమబద్ధీకరిస్తుంది. చిలగడదుంపలు వివిధ యాంటీఆక్సిడెంట్లను మన శరీరానికి అందిస్తాయి, ఇవి కొన్ని రకాల కాన్సర్ల నుండి మనలని రక్షించడంలో సాయపడతాయి. చిలకడదుంపలను తినడం వల్ల మెదడు పనితీరు మెరుగుపడుతుంది. చిలగడదుంపలోని ఆంథోసైనిన్లు మంటను తగ్గించి ఫ్రీ రాడికల్ డామేజ్ ను తగ్గిస్తాయి. తక్కువ మోతాదులో షుగర్ ఉన్నవారికి మంచిదని చెబుతున్నారు. ఇందులో ఉండే మెగ్నీషియం ఆరోగ్యకరమైన ధమనులకు, గుండె కండరాలకు చాలా మంచిది. రక్తపోటును నియంత్రిస్తుంది. చిలగడదుంపలో ఉండే ఫైబర్, యాంటీఆక్సిడెంట్లు గట్ ఆరోగ్యానికి చాలా మంచిది. చిలగడదుంపలో కరిగే, కరగని లాంటి రెండు రకాల ఫైబర్ ఉంటుంది. మన శరీరంలోని జీర్ణ వ్యవస్థ ఏ రకమైన ఫైబర్ ను జీర్ణం చెయ్యదు. అందువల్ల, ఫైబర్ మీ జీర్ణవ్యవస్థలోనే ఉంటుంది. ఇది అనేక రకాల గట్ సంబంధిత ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తుంది.



# ఈ జ్యూస్ తాగారంటే.. పవర్‌ఫుల్ ఎనర్జీ..!

ఒక గ్లాసు తాజా ఆరోగ్యకరమైన పైనాపిల్ జ్యూస్‌తో మీ రోజును ప్రారంభించడం వల్ల మీ మానసిక స్థితి మెరుగుపడటమే కాకుండా రోజంతా సహజ శక్తి లభిస్తుంది. పైనాపిల్ జ్యూస్ రుచికరమైనది మాత్రమే కాదు, మీ చర్మాన్ని ప్రకాశవంతంగా, మృదువుగా ఉంచడంలో, పేగు ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో, మీ ఉదయం మరింత ఉత్సాహంగా ఉండటానికి సహాయపడేలా చేస్తుంది. పైనాపిల్ ఆరోగ్యానికి చాలా మంచిది.. కాస్త పులుపు, తీపి కలిసిన పైనాపిల్ రుచి భలేగా ఉంటుంది. ప్రతి ఉదయం పైనాపిల్ జ్యూస్ తాగడం వల్ల ఎన్ని లాభాలో మీకు తెలుసా..? ఇది మీ మొత్తం ఆరోగ్యం, శ్రేయస్సును పెంచుకోవడానికి సరళమైన, అత్యంత శక్తివంతమైన మార్గాలలో ఒకటి. ఇందులో విటమిన్ సి, యాంటీఆక్సిడెంట్లు , బ్రోమెలైన్ వంటి ఎంజైమ్‌లతో సహా అవసరమైన పోషకాలతో నిండి ఉంటుంది. కానీ బ్రోమెలైన్ మీ శరీరంలో ఖచ్చితంగా ఏం చేస్తుందంటే.. ఇది జీర్ణక్రియను మెరుగుపరచడానికి, మీ రోగనిరోధక వ్యవస్థకు మద్దతు ఇవ్వడానికి, వాపును తగ్గించడానికి సహాయపడుతుంది. అంతేకాకుండా, ఒక గ్లాసు తాజా ఆరోగ్యకరమైన పైనాపిల్ జ్యూస్‌తో మీ రోజును ప్రారంభించడం వల్ల మీ మానసిక స్థితి మెరుగుపడటమే కాకుండా రోజంతా సహజ శక్తి లభిస్తుంది. పైనాపిల్ జ్యూస్ రుచికరమైనది మాత్రమే కాదు, మీ చర్మాన్ని ప్రకాశవంతంగా, మృదువుగా ఉంచడంలో, పేగు ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో, మీ ఉదయం మరింత ఉత్సాహంగా ఉండటానికి సహాయపడేలా చేస్తుంది. పైనాపిల్ జ్యూస్ మీ చర్మానికి చాలా ఆరోగ్యకరమైనది. ప్రయోజనకరమైనది. ప్రధానంగా దాని విటమిన్ సి, యాంటీఆక్సిడెంట్లు చర్మ ఆకృతిని మెరుగుపరచడంలో మొటిమలను తగ్గించడంలో సహాయపడతాయి. పైనాపిల్ జ్యూస్‌లో విటమిన్ సి, మాంగనీస్, బ్రోమెలైన్ ఉంటాయి. బ్రోమెలైన్ అనేది ఒక ఎంజైమ్, ఇది జీర్ణక్రియకు సహాయపడుతుంది. పైనాపిల్ జ్యూస్ తాగడం వల్ల మీ రోగనిరోధక శక్తి పెరుగుతుంది. పైనాపిల్ జ్యూస్ మీ జీర్ణ ఆరోగ్యానికి కూడా చాలా మంచిది. ఇందులో అనేక ఎంజైమ్‌లు ఉంటాయి. ముఖ్యంగా బ్రోమెలైన్. ఇది ప్రోటీన్‌లను విచ్ఛిన్నం చేయడం ద్వారా, జీర్ణవ్యవస్థలో మంటను తగ్గించడం ద్వారా జీర్ణక్రియను మెరుగుపరచడంలో సహాయపడుతుంది. పైనాపిల్ జ్యూస్ తాగడం మీ గుండెకు మంచిది. దీనిలోని అధిక విటమిన్ సి కంటెంట్ మీ రక్త నాళాలను సరళంగా, బలంగా ఉంచడంలో సహాయపడుతుంది. చివరికి మెరుగైన గుండె ఆరోగ్యానికి దారితీస్తుంది.

# రొయ్యల వేపుడు.. ఇంట్లో చేసుకోండిలా..



చాలామంది ఇంట్లో నాన్ వెజ్ వండుకుంటారు. వాటిలోకిచికెన్, మటన్, ఫిష్ వంటివి తింటారు. చాలామంది రొయ్యలు కూడా తింటుంటారు. కానీ వండుకోవడం రాదు. అయితే ఈ మీ ఇంట్లోనే మీకు నచ్చేలా టేస్టీగా ప్రాన్స్ ఫ్రై ఎలా తయారు చేసుకోవాలి.? ప్రాన్స్ ఫ్రై తయారు చేయడానికి 1 పౌండ్ రొయ్యలు శుభ్రం చేసి ముక్కలుగా కోయండి, 1/2 కప్పు కొబ్బరి నూనె లేదా కూరగాయల నూనె, 23 ఎండిన ఎర్ర మిరపకాయలు ముక్కలుగా కోయండి, 1 టీస్పూన్ ఆవాలు, 1 టీస్పూన్ జీలకర్ర, 1 టీస్పూన్ పసుపు, 1 టీస్పూన్ ఎర్ర కారం, 1 టీస్పూన్ గరం మసాలా పొడి, 1/2 టీస్పూన్ ఉప్పు, 23 వెల్లుల్లి రెబ్బలు ముక్కలుగా కోయండి, సన్నగా తరిగిన 1 చిన్న ఉల్లిపాయ, తరిగిన తాజా కొత్తిమీర, నిమ్మకాయ ముక్కలు వంటి వస్తువులు కావాలి. ఒక గిన్నెలో శుభ్రం చేసి ముక్కలు చేసుకున్న 1 పౌండ్ రొయ్యలు, పసుపు, ఎర్ర కారం, గరం మసాలా పొడి, ఉప్పు వేసి కనీసం 30 నిమిషాలు బాగా నానబెట్టండి. మీకు కావాలనుకుంటే ఉందులో పెరుగు కూడా యాడ్ చెయ్యండి. ఇది రొయ్యలు వేపుడు రుచిని పెంచుతుంది. ముందుగా స్టవ్ ఆన్ చేసుకొని.. దాని మీద పాన్ పెట్టుకోండి. తర్వాత అందులో నూనె వేసి మీడియం మంట మీద వేడెక్కనివ్వండి. నూనె వేడెక్కిన తర్వాత ఆవాలు, జీలకర్ర వేసి రంగు మారేంతవరకు వాటిని బాగా వేయించుకోవాలి. అందులోనే తరిగిన ఉల్లిపాయలు వేసి పారదర్శకంగా వేయించాలి. తరువాత, తరిగిన వెల్లుల్లి వేసి మరో నిమిషం వేయించాలి. తర్వాత మ్యారినేట్ చేసిన రొయ్యలను పాన్‌లో వేసి అవి గులాబీ రంగులోకి వచ్చి ఉడికినంత వరకు వేయించాలి. ఎండి మిర్చి వేసి మరో నిమిషం వేయించాలి. రుచికి ఉప్పు వేసి, తరిగిన కొత్తిమీరతో అలంకరించండి. అంతే అంతే రుచికరమైన ప్రాన్స్ ఫ్రై సిద్ధం అయిపోతుంది. పక్కన నిమ్మకాయ ముక్కలతో వేడిగా వడ్డించండి. ఇంట్లో అందరు ఇష్టంగా తింటరు. మీ రొయ్యల వేపుడుకి ఉత్తమ రుచిని పొందడానికి తాజా, అధిక నాణ్యత గల పదార్థాలను ఉపయోగించండి. మీకు కావలసిన కారపు స్థాయికి అనుగుణంగా కారం ఎండి మిరపకాయల పరిమాణాన్ని సర్దుబాటు చేయండి. మీరు రొయ్యల వేపుడును సైడ్ డిష్‌గా లేదా అన్నం లేదా రోటీతో ప్రధాన వంటకంగా వడ్డించవచ్చు.

# నెయ్యి స్వచ్ఛతపై అనుమానం ఉందా.?



వేడి వేడి అన్నంలో ముద్దపప్పు వేసుకుని, దోసెడు నెయ్యి కలుపుకు తింటే ఆ రుచే వేరు. అయితే ఇంట్లో తయారు చేసిన నెయ్యితో ఎలాంటి సమస్య లేదు. కానీ మార్కెట్లో రకరకాల నెయ్యి బ్రాండ్లు అందుబాటులో ఉన్నాయి. వీటిల్లో అసలు ఏదో.. కల్తీ ఏదో తెలియక చాలామంది తికమక పడుతుంటారు. ఇదే అదనుగా కల్తీ రాయుళ్లు వెజిటబుల్ ఆయిల్, జంతు కొవ్వు, మినరల్ ఫ్యాట్, స్టార్చ్ వంటి ఇతర పదార్థాలను కలిపి కల్తీ నెయ్యి యదేచ్ఛగా అమ్ముతుంటారు. అయితే మీరు మార్కెట్లో కొనుగోలు చేసిన నెయ్యి స్వచ్ఛమైనదా.. కాదా అనే విషయం తేలిగ్గా గుర్తించొచ్చు. వేడి వేడి అన్నంలో ముద్దపప్పు వేసుకుని, దోసెడు నెయ్యి కలుపుకు తింటే ఆ రుచే వేరు. అయితే ఇంట్లో తయారు చేసిన నెయ్యితో ఎలాంటి సమస్య లేదు. కానీ మార్కెట్లో రకరకాల నెయ్యి బ్రాండ్లు అందుబాటులో ఉన్నాయి. వీటిల్లో అసలు ఏదో.. కల్తీ ఏదో తెలియక చాలామంది తికమక పడుతుంటారు. ఇదే అదనుగా కల్తీ రాయుళ్లు వెజిటబుల్ ఆయిల్, జంతు కొవ్వు, మినరల్ ఫ్యాట్, స్టార్చ్ వంటి ఇతర పదార్థాలను కలిపి కల్తీ నెయ్యి యదేచ్ఛగా అమ్ముతుంటారు. అయితే మీరు మార్కెట్లో కొనుగోలు చేసిన నెయ్యి స్వచ్ఛమైనదా.. కాదా అనే విషయం తేలిగ్గా గుర్తించొచ్చు. అరచేతిలో ఒక చెంచా నెయ్యి తీసుకుని మెత్తగా రుద్దాలి. అరచేతిలో నెయ్యి కరిగితే అది స్వచ్ఛమైన నెయ్యి అని అర్థం. అరచేతిలో గట్టి పదార్థం కరగకుండా అలాగే ఉండిపోతే అందులో కల్తీ పదార్థం కలిసి ఉందని అర్థం. అలాగే కొద్ది మొత్తంలో నెయ్యి తీసుకొని పారదర్శక సీసాలో వేయాలి. దానికి కొద్దిగా చక్కెర జోడించాలి. ఆ తర్వాత సీసా మూత మూసివేసి బాగా షేక్ చేయాలి. కాసేపటి తర్వాత సీసా అడుగున ఎర్రటి చారలు కనిపిస్తే.. ఈ నెయ్యి కల్తీ అని అర్థం చేసుకోవాలి. కల్తీని గుర్తించేందుకు మార్కెట్ నుంచి తెచ్చే నెయ్యిలో నాలుగైదు చుక్కల అయోడిన్ వేయాలి. నెయ్యి నీలం రంగులోకి మారితే కల్తీ అని అర్థం. నెయ్యి నాణ్యతను గుర్తించేందుకు చేతికి కాస్త నెయ్యి రాసి రెండు చేతులతో బాగా రుద్దాలి. సువాసనగా ఉంటే అది స్వచ్ఛమైన నెయ్యి. కొంత సమయం తర్వాత నెయ్యి వాసన పోతే అది కల్తీ నెయ్యి. స్వచ్ఛమైన నెయ్యి అయితే అది పూసలా ఉంటుంది. వేడిచేసినప్పుడు నూనెలా కనిపిస్తుంది. అలాగే నెయ్యి ఉపరితలంపై తెట్టులా ఏర్పడినా.. కరిగిన నెయ్యి లేత పసుపు, తెలుపు రంగులో ఉన్నా అది ఖచ్చితంగా నకిలీ నెయ్యి. కొందరు నెయ్యిలో వంట నూనె కలుపుతారు. మీరు వినియోగించే నెయ్యిలో నూనె కలిసిందో లేదో తెలుసుకోవాలంటే నెయ్యి వేడి చేసి ఫ్రిజ్ లో పెడితే రెండు పొరలుగా ఏర్పడితే అది కల్తీ. నెయ్యి, ఇతర నూనె వేర్వేరు పొరలుగా ఉంటే కల్తీ నెయ్యిగా అర్థం చేసుకోవాలి.

# ఈ మొక్కలు ఇంట్లో పెంచుకుంటే డబ్బుకు డబ్బు



ప్రకృతికి, మానవ జీవితానికి మధ్య ఉన్న సంబంధం ప్రత్యేకమైనది. మన ఇళ్లలో పెంచే మొక్కలు కేవలం గాలిని శుద్ధి చేయడానికే కాకుండా, మన జీవితంలో సిరి సంపదలు, అదృష్టం, శ్రేయస్సును ఆకర్షిస్తాయని ఫెంగ్ షూయ్ వాస్తు శాస్త్రాలు చెబుతున్నాయి. కొన్ని ప్రకృతికి, మానవ జీవితానికి మధ్య ఉన్న సంబంధం ప్రత్యేకమైనది. మన ఇళ్లలో పెంచే మొక్కలు కేవలం గాలిని శుద్ధి చేయడానికే కాకుండా, మన జీవితంలో సిరి సంపదలు, అదృష్టం, శ్రేయస్సును ఆకర్షిస్తాయని ఫెంగ్ షూయ్ వాస్తు శాస్త్రాలు చెబుతున్నాయి. కొన్ని ప్రత్యేకమైన మొక్కలను ఇంట్లో సరైన దిశలో ఉంచడం ద్వారా పాజిటివ్ ఎనర్జీ పెరుగుతుంది, ఆర్థిక ఇబ్బందులు తొలగిపోయి, అదృష్టం తలుపు తడుతుందని నమ్ముతారు. మీ ఇంట్లో సానుకూలతను, సంపదను నింపడానికి ఎలాంటి అదృష్ట మొక్కలను పెంచాలో ఇప్పుడు తెలుసుకుందాం. ఈ మొక్కలను 'ఫ్రెండ్‌షిప్ ట్రీ', 'లక్కీ ప్లాంట్' అని కూడా పిలుస్తారు. జేడ్ ప్లాంట్‌కి నాణేల ఆకారం వంటి చిన్న, గుండ్రని, మందపాటి ఆకులు ఉంటాయి. ఈ మొక్కను వృద్ధి, పునరుద్ధరణకు చిహ్నంగా పరిగణిస్తారు. దీనిని బహుమతిగా ఇవ్వడం అదృష్టాన్ని పంచుతుందని భావిస్తారు. దీన్ని ఇంటి ప్రవేశ ద్వారం వద్ద, కార్యాలయంలో ఉంచడం శుభకరంగా నమ్ముతారు. లక్కీ బాంబూ మొక్క శాంతి, అదృష్టం, శ్రేయస్సును సూచిస్తుంది. కాండాల సంఖ్యను బట్టి దీని ప్రయోజనం మారుతుంది, మూడు కాండాలు సంతోషం, సంపద, దీర్ఘాయువును సూచిస్తాయి. దీనిని ఇంటి తూర్పు లేదా ఆగ్నేయ దిశలో ఉంచుతారు. భారతీయ సంస్కృతిలో తులసి మొక్కకు అత్యంత పవిత్ర స్థానం ఉంది. దీనిని హిందువులు లక్ష్మీ దేవి స్వరూపంగా భావిస్తారు. ఈ మొక్క ఇంటి చుట్టూ పాజిటివ్ ఎనర్జీని సృష్టిస్తుంది, మానసిక ప్రశాంతతను ఇస్తుంది. దీనిని ఇంటి ప్రాంగణంలో లేదా ఈశాన్య దిశలో ఉంచడం ఆచారం. దీని ఆకులను ఔషధంగానూ ఉపయోగిస్తారు. ఈ మొక్క స్వచ్ఛత, శాంతి, ప్రశాంతతకు చిహ్నం. ఇది కేవలం ఇంటి అందాన్ని పెంచడమే కాకుండా, ఇంట్లో సానుకూల వాతావరణాన్ని సృష్టించి, ఆర్థిక ఒత్తిడిని తగ్గిస్తుంది. ఇది ఇండోర్ ఎయిర్ ప్యూరిఫైయర్‌గా కూడా పనిచేస్తుంది. రబ్బర్ మొక్కలు వాటి గుండ్రని, పెద్ద ఆకుల కారణంగా సంపద, శ్రేయస్సును సూచిస్తాయని ఫెంగ్ షూయ్ చెబుతుంది. ఆకుపచ్చ రంగు డబ్బును ఆకర్షిస్తుందని నమ్ముతారు.

# పెళ్లి చేసుకోవడానికి సరైన సమయం ఏదీ?



ఈ మధ్య కాలంలో చాలా మంది లేట్ మ్యారెజ్‌ను ఇష్టపడుతున్నారు. ఇది ప్రస్తుతం ఒక ట్రెండ్‌గా కొనసాగుతుంది. యువత ఎవరిని అడిగినా.. మేం సెటిల్ అయ్యాక పెళ్లి చేసుకుంటామని చెబుతున్నారు. అలా దాదాపు 2830 ఏళ్లకు చాలా మంది వివాహం చేసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో చాలా మంది మైండ్‌లో ఒక ప్రశ్న ఉండిపోయింది. ఇంతకు ఎప్పుడు పెళ్లి చేసుకోవాలి, పెళ్లి చేసుకోవడానికి సరైన సమయం ఉందా అని. నేటి యువతలో చాలా మందికి వివాహం గురించి సరైన స్పష్టత ఉండట్లేదు. అందుకే చాలా మంది ఏ వయస్సులో పెళ్లి చేసుకోవాలి.. పెళ్లి చేసుకోవడానికి సరైన సమయం ఏదనే సందేహాలకు సమాధానాలు వెతుకుతున్నారు. వివాహ నిర్ణయాలు అనే తరచుగా బంధువులు, సమాజం, కుటుంబం నుండి వచ్చే ఒత్తిళ్ల ద్వారా ప్రభావితమవుతాయి. అయితే, ఎప్పుడు వివాహం చేసుకోవాలో అనేది ఒకరి వ్యక్తిగత నిర్ణయంపై ఆధారపడి ఉండాలని నిపుణులు చెబుతున్నారు. మీరు వివాహ జీవితాన్ని ప్రారంభించడానికి సిద్ధంగా ఉన్నారని మీకు నమ్మకం ఉన్నప్పుడు మాత్రమే మీరు వివాహం చేసుకోవాలంటున్నారు. వివాహం చేసుకోవడానికి సరైన సమయం అనేది వ్యక్తిగత నిర్ణయం అని నిపుణులు చెబుతున్నారు. నేటి ప్రపంచంలో, వివాహం అనే ఆలోచనలో మనం చాలా మార్పులను చూస్తున్నాము. పురుషులు, మహిళలు పెళ్లి చేసుకునే ముందు వారి కెరీర్ లక్ష్యాలను సాధించడం, వారి అభిరుచులను అనుసరించడానికి ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నారు. విజయవంతమైన వివాహం బలమైన పునాదిపై ఆధారపడి ఉంటుంది. పెళ్లి చేసుకోబోయే ఇద్దరు భవిష్యత్తు గురించి ఒకే విధమైన అవగాహన కలిగి ఉండాలి అలా ఉంటేనే వారి వివాహ జీవితం సజావుగా సాగుతుంది. వాహానికి సరైన వయస్సు లేదు! వివాహానికి 'పరిపూర్ణ వయస్సు' అనేది కేవలం ఒక భావన. వివాహం చేసుకోవడానికి సరైన సమయం వ్యక్తిగత పరిస్థితులు, సాంస్కృతిక నేపథ్యాన్ని బట్టి మారుతుంది. బయటి వారి అంచనాల కంటే, వారు పెళ్లికి సిద్ధంగా ఉన్నారా లేదా అనే దాని ఆధారంగా ప్రజలు నిర్ణయాలు తీసుకోవాలి. భాగస్వాములు తమ జీవిత లక్ష్యాలలో స్థిరంగా ఉంటేనే వివాహం జరగాలని జాట్‌లు అంటున్నారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక



## భారత్ బియ్యంపై సుంకం

భారత్ బియ్యంతో సహా వ్యవసాయ దిగుమతులపై సుంకాలు విధించేందుకు తన ప్రభుత్వం సిద్ధంగా ఉందని అమెరికా అధ్యక్షులు డోనాల్డ్ ట్రంప్ బెదిరించారు. భారత్ నుంచి సబ్సిడీతో దిగుమతి అవుతున్న బియ్యం అమెరికా మార్కెట్లను దెబ్బతీస్తోందని, ఫలితంగా దేశంలో ధరలు పడిపోతున్నాయని, దీనిపై కఠిన చర్యలు తీసుకోవాలని అమెరికా రైతులు కోరుతున్నారని ట్రంప్ చెప్పారు. ఈ మేరకు మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అమెరికా మార్కెట్లను దెబ్బతీస్తున్న దేశాలను గుర్తించాల్సిందిగా అధికారులను ఆదేశించారు. కెనడా నుంచి దిగుమతి అవుతున్న ఎరువులపై కూడా సుంకాలు విధిస్తామని తెలిపారు. అమెరికా ఉత్పత్తులను పెంచేందుకు భారీగా సుంకాలను విధించే విషయాన్ని పరిశీలిస్తున్నామని చెప్పారు. భారత్, థారులాండ్, చైనా వంటి దేశాలు పెద్దయెత్తున మోసానికి పాల్పడుతున్నాయని లూసియానాలోని కెన్నడీ రైస్ మిల్లు సిఇఒ మెర్లీ కెన్నడీ.. దేశాధ్యక్షుడికి ఫిర్యాదు చేశారు. దీంతో ఏయే దేశాల నుంచి చౌకగా సరుకులు డంపింగ్ అవుతున్నాయో పరిశీలించాలని ఆర్థిక మంత్రి స్కాట్ బెస్సెంట్‌ను ట్రంప్ కోరారు.



## ఘోర రోడ్డు ప్రమాదం..

యూపీలోని బారాబంకి జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. పూర్వాంచల్ ఎక్స్‌ప్రెస్ హైవేపై రెండు కార్లు ఢకొ•ని మంటలు చెలరేగాయి. ఈ ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన ఐదుగురు కారులోనే సజీవ దహనమయ్యారు. మృతుల్లో తల్లి, నలుగురు పిల్లలు ఉన్నారు. ఐదుగురు గాయపడ్డారు. ఇందులో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. వారిని సమీప ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నట్లు ఎస్పీ అర్జిత విజయవర్గియా తెలిపారు. ఈ ప్రమాదంలో మృతి చెందిన వారు ఆజంగఢ్‌లో విధులు నిర్వరిస్తున్న వారణాసికి చెందిన కానిస్టేబుల్ జావెద్ అష్రఫ్ భార్య, ముగ్గురు కూతుళ్లు, కొడుకు ఉన్నట్లు తెలిపారు. పూర్వాంచల్ ఎక్స్‌ప్రెస్ హైవేపై కారును కొద్దిసేపు ఆపగా.. ఇదే సమయంలో ఆజంగఢ్ నుంచి వస్తున్న బ్రెజ్జా కారు వెనుక నుంచి ఢకొ•ట్టింది. దీంతో ఒక్కసారిగా మంటలు చెలరేగి ప్రమాదం జరిగినట్లు ఎస్పి తెలిపారు.

# కెనడాలో ఘనంగా డి.టి.సి ఫ్యామిలీ ఫెస్ట్ 2025

కెనడాలోని దర్‌హమ్ తెలుగు క్లబ్ (డిటిసి) ఆధ్వర్యంలో కార్తీక మాసపు వనభోజన కాన్సెప్ట్‌తో ''డి.టి.సి ఫ్యామిలీ ఫెస్ట్ 2025:'' వేడుకలు ఘనంగా జరిగాయి. టొరంటోలోని మ్యాక్స్‌వెల్ హైట్స్ సెకండరీ స్కూల్‌లో ఓషావా ఆడిటోరియంలో జరిగిన ఈ కార్యక్రమానికి సుమారు 800కి పైగా తెలుగు కుటుంబాలు హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి వ్యాఖ్యాతలుగా అపర్ణా రంభోట్ల సంతోష్ కుంద్రు, యువ వ్యాఖ్యాతలుగా ఆశ్రిత పోన్నపల్లి, శిరి వంశికా చిలువేరు, శ్రేయస్ ఫణి పెండ్యాల వ్యవహరించారు. డి.టి.సి ఎగ్జిక్యూటివ్ కమిటీసభ్యులు నరసింహారెడ్డి గుత్తిరెడ్డి తదితరుల చేతుల మీదుగా జ్యోతి ప్రజ్వలన జరిగింది. తరువాత కెనడా జాతీయ గీతం మరియు మా తెలుగు తల్లి గీతంతో కార్యక్రమం ఘనంగా ప్రారంభమైంది. ఈ వేడుకలకు విశిష్ట అతిథులుగా సెయింట్ మైకేల్ హాస్పిటల్ డివిజన్ హెడ్ కార్డియాక్ సర్జరీ డా. బాబీ యానగావా (ఎం.డి, పీహెచ్.డి, ఎఫ్.ఆర్.సి.ఎస్.సి) విచ్చేశారు. అనంతరం



జరిగిన సాంస్కృతిక కార్యక్రమాల్లో అన్ని వయసుల పిల్లలు, కళాకారులు అద్భుతమైన నృత్యాలు, సంగీత ప్రదర్శనలు, సంప్రదాయ కళారూపాలతో ప్రేక్షకులను అలరించారు. ఈ వేడుకలో డి.టి.సి కుకింగ్ షో మరియు డి.టి.సి కిడ్స్ ఫ్యాషన్ షో ప్రత్యేక ఆకర్షణలుగా నిలిచాయి. విజేతలు మరియు పాల్గొన్న వారికి అడ్వాన్స్‌డ్ పిజియో వారి బహుమతులు గ్రాండ్ స్పాన్సర్‌గా తూసి వినయగమూర్తి అందజేశారు. డి.టి.సి కల్చరల్ డైరెక్టర్ వెంకటేశ్వర్ చిలువేరు గారు మాట్లాడుతూ.. ఇలాంటి కార్యక్రమాలు మన సంస్కృతి, సాంప్రదాయాలను భావితరాలకు చేరవేస్తాయని అన్నారు. కెనడాలో నివసిస్తున్న తెలుగు సమాజం చూపుతున్న ఐక్యత, సహకారం పట్ల కృతజ్ఞతలు తెలిపారు. మన భారత సాహితి, సంపద ఉత్సవాలను కెనడాలో ఘనంగా జరపడం మన అదృష్టంగా భావిస్తున్నానని అన్నారు. పలువురికి డీ.టి.సి ఎక్సలెన్సీ అవార్డులు అందజేశారు. కార్యక్రమ విజయానికి చేయూతనిచ్చిన ప్రాయోజకులను డిటిసి సంస్థ శాలువాలతో సత్కరించింది. ఈ కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా గ్రేటర్ టొరాంటో ఏరియా(జీ.టీ.ఏ) లోని పలు తెలుగు సంఘాల ప్రతినిధులను దర్‌హమ్ తెలుగు క్లబ్ ఆహ్వానించి వారిని సత్కరించింది. ఈ సందర్భంలో డిటిసి ప్రెసిడెంట్ శ్రీ నరసింహారెడ్డి గుత్తిరెడ్డి మాట్లాడుతూ: ''తెలుగు సమాజానికి ఉపయోగపడే కార్యక్రమాలను నిర్వహించే దిశగా, గ్రేటర్ టొరాంటో ఏరియా(జీ.టీ.ఏ) లోని అన్ని సంస్థలు పనిచేస్తున్నాయని అన్నారు. దర్‌హమ్ తెలుగు క్లబ్ (డి.టి.సి) సమాజ కార్యక్రమాలు, వినూత్న పోగ్రామ్స్, ఎక్సలెన్సీ అవార్డులు, సహకార కార్యక్రమాల విజయానికి ప్రాయోజకులు అందిస్తున్న మద్దతుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## గాజా ఒప్పందాన్ని ఉద్దేశపూర్వకంగా ఉల్లంఘించిన ఇజ్రాయిల్

కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఇజ్రాయిల్ ఉద్దేశపూర్వకంగా ఉల్లంఘించిందని గాజా అధికారులు ఒక నివేదికలో తెలిపారు. గత అక్టోబర్‌లో గాజా కాల్పుల విరమణ ఒప్పందంపై పాలస్తీనియన్ రెసిస్టెన్స్ మూమెంట్ హమాస్‌తో ఇజ్రాయిల్ సంతకం చేసిన సంగతి తెలిసిందే.కాల్పుల విరమణ అమల్లోకి వచ్చిన 60 రోజుల్లో, అక్రమ నిర్బంధాలు, ఉద్దేశపూర్వక విధ్వంసం మరియు మానవతా సాయాన్ని తీవ్రంగా అడ్డుకోవడం సహా ఇజ్రాయిల్ సైన్యం 738 అధికారిక ఉల్లంఘనలకు పాల్పడినట్లు నివేదిక తెలిపింది. ఈ దాడుల్లో 377 మంది పౌరులు మరణించారని, వీరిలో అధికంగా మహిళలు, పిల్లలు, వృద్ధులు ఉన్నారని పేర్కొంది. అక్టోబర్ 10 నుండి డిసెంబర్ 8 వరకు దాడులు సహా ఇజ్రాయిల్ దళాలు క్రూరంగా విరుచుకుపడ్డాయని వివరించింది. ఉల్లంఘనల్లో పౌరులపై 205 ప్రత్యక్ష కాల్పులు, జనావాస ప్రాం



తాల్లోకి 37 సైనిక వాహనాల చొరబాట్లు, నివాస గృహాలు లక్ష్యంగా 358 బాంబు దాడులు ఉన్నాయని పేర్కొంది. మరో 138 దాడుల్లో పౌర భవనాలు, మౌలిక సదుపాయాల ధ్వంసం జరిగిందని తెలిపింది. ఈ దాడుల్లో 980మంది గాయపడగా, వారిలో చాలామంది తీవ్రంగా గాయపడిన వారు ఉన్నారు. ఇప్పటికే నిండిపోయిన ఆస్పత్రుల్లో అత్యవసర వైద్య సహాయాన్ని అడ్డుకోవడం, అంతర్జాతీయచట్టాలను ఉల్లంఘిస్తూ.. భూభాగాలను స్వాధీనం చేసుకోవడం, మానవతా సాయాన్ని ఉద్దేశపూర్వకంగా అడ్డుకోవడం వంటి చర్యలతో పాటు 43 అక్రమ నిర్బంధ కేసులు ఉన్నాయని తెలిపింది. మానవతా సాయాన్ని ఉద్దేశపూర్వకంగా, క్రమబద్ధంగాఅడ్డుకోవడంతో గాజా అంతటా వేలాది మంది ఆహారం, ఇతర సేవలు లేక బాధపడుతున్నారని నివేదిక తెలిపింది. ఈ 60 రోజుల్లో కేవలం 13,511 మానవతా సహాయ ట్రక్కులు మాత్రమే గాజాలోకి ప్రవేశించాయని నివేదక స్పష్టం చేసింది. ఇది 36,000 ట్రక్కుల ఒప్పందంలో 38శాతం మాత్రమేనని తెలిపింది. ఉద్దేశ్యపూర్వక అడ్డంకులతో తీవ్రమైన శీతాకాల పరిస్థితుల్లో ఆహారం, స్వచ్ఛమైన నీరు, వైద్య సామాగ్రి మరియు ఆశ్రయం వంటి ప్రాథమిక అవసరాల కొరతకు దారితీసింది. వీటిలో నిరాశ్రయులకు గుడారాలు కూడా ఉన్నాయి. ఇప్పటికే దుర్భలంగా ఉన్న గాజా వాసులను మరింత లోతైన మానవతా సంక్షోభంలోకి నెట్టివేసిందని నివేదిక పునరుద్ఘాటించింది.

## మానవాళి మనుగడకు దిక్సూచి

ఆధునిక కాలంలో మానవ మనుగడలో అహ్మదాబాద్‌లోని స్పేస్ అప్లికేషన్ సెంటర్ కీలక పాత్ర పోషిస్తోంది. ఏది కావాలన్నా చేతిలో సెల్‌ఫోన్ నుంచే అన్ని తెప్పించుకునే స్థితిలో వున్నాం. దీని వెనుక శాస్త్రవేత్తల కృషి, పరిశోధనల ఫలితాలున్నా యి. ఇందులో భాగంగా అహ్మదాబాద్‌లోని స్పేస్ అప్లికేషన్ సెంటర్లో జరుగుతోన్న పరిశోధనలు ఎన్నో ప్రయోజనాలు అందిస్తున్నాయి. తుపానులు సమయాల్లో ముందుగానే ప్రజలను అప్రమత్తం చేసి ప్రాణాపాయం జరగకుండా కాపాదగలుగుతున్నారం టే ఈ సాంకేతిక పరిజ్ఞానం స్పేస్ సెంటర్ నుంచే అందుతోంది. కమ్యూనికేషన్, నావిగేషన్, భూమి, గ్రహాల పరిశీలన, వాతావరణంలోని మార్పులను నిరంతరం గమనిస్తూ సమాచారాన్ని ఎప్పటికప్పుడు విశ్లేషిస్తోంది. బుధవారం నాడు ఎపి మీడియా ప్రతినిధులు స్పేస్ సెంటర్‌ను సందర్శించగా.. అక్కడ శాస్త్రవేత్తలు ప్రస్తుతం జరిగే పరిశోధనలను వివరించారు. ల్యాబ్‌లలో చేస్తున్న నూతన ఆవిష్కరణలు, సెమికండక్టర్ వంటి వాటిని విశదీకరించి వెల్లడించారు. ప్రత్యక్షంగా చూపించారు. తొలుత స్పేస్ సెంటర్ ఎగ్జిబిషన్ కేంద్రంలో ఛాయా చిత్రాల్లో స్పేస్ సెంటర్ ఆవిష్కరణలను వివరించారు. అనంతరం స్పేస్ సెంటర్ డైరెక్టర్ నీలేష్ ఎం దేశారు ఎపి మీడియా ప్రతినిధులతో భేటీ అయ్యారు. అక్క ఇప్పటి వరకూ జరిగిన పరిశోధనల ఫలాలు ప్రజలకు ఎలా ఉపయోగపడుతున్నాయో వివరించారు. శాటిలైట్‌కు అవసరమైన అన్ని రకాల కీలక పరికరాలు అక్కడే తయారు చేస్తున్నట్లు చెప్పారు. ఇస్రో కింది




వున్న ముఖ్యమైన కేంద్రాల్లో ఇదొకటిగా పేర్కొన్నారు. సాటిలైట్లో వాడే కెమెరాలు, మాడ్యులర్స్ తయారు చేస్తామన్నారు. అక్కడ నుంచి వాటిని తరలించి వివిధ కేంద్రాల్లో అవసరమైన పరికరాలు అమర్చాకే చివరికి లాంచింగ్ కేంద్రానికి వెళ్తుందన్నారు. ప్రస్తుతం అక్కడ సెమికండక్టర్లు కూడా తయారవుతున్నాయన్నారు. ఇప్పటి వరకూ థాయిలాండ్, చైనాపైనే వీటి కోసం ఆధారపడినట్లు చెప్పారు. ఇప్పుడు సొంత టెక్నాలజీతో అక్కడే తయారు చేస్తున్నట్లు పేర్కొన్నారు. అన్ని రకాల శాస్త్రాలకు స్పేస్ సెంటర్ నుంచి సాంకేతికతను అందిస్తున్నామన్నారు. వ్యవసాయం స్థితిగతుల అధ్యయనానికి, వాతావరణ పరిస్థితుల అంచనాలు అక్కడ్నుంచే జరుగుతాయని చెప్పారు. నావిగేషన్ ఎంతో కీలకంగా మారిందని, అది కూడా అక్కడే తయారుచేసిన అప్లికేషన్ అన్నారు. ప్రభుత్వాలకు కావాల్సిన అన్ని రకాల సేవలకు అక్కడ నుంచి సాంకేతికత రూపొందిస్తున్నామన్నారు. గగనయాన్ ప్రయోగం ప్రధాన కర్తవ్యంగా చెప్పారు. 2027లో ప్రయోగించాలన్నది ప్రభుత్వ లక్ష్యంగా ఉందన్నారు. అన్నీ సిద్ధంగానే ఉన్నాయన్నారు. అయితే వ్యోమగాములు వెళ్లాల్సి ఉన్నందున తర్జనభర్జనలు సాగుతున్నాయని తెలిపారు. ఇది దశలవారీ జరగాల్సిన పక్రియగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్పేస్ సెంటర్ శాస్త్రవేత్తలు డాక్టర్ అభా చాబ్రా, శాంతను సిన్హా, రాష్ట్రానికి చెందిన శాస్త్రవేత్తలు సునీల జోగేశ్వరావు, వెంకట రమణ, ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో ఎపి డైరెక్టర్ సురేష్, శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## విమాన ఛార్జీలు అలా ఎలా పెంచేస్తారు ?

విమానాలు పెద్ద సంఖ్యలో రద్దు కావడంతో నష్టపోయిన ప్రయాణికులకు తక్షణమే తగిన పరిహారం చెల్లింపునకు చర్యలు తీసుకోవాలంటూ ఢిల్లీ హైకోర్టు బుధవారం ఇండిగోను ఆదేశించింది. సంక్షోభం కనీవినీ ఎరుగని రీతిలో నెలకొన్న సమయంలో ఇతర విమానయాన సంస్థలు అనూహ్యంగా ఛార్జీలను ఎలా పెంచేస్తాయని ప్రశ్నించింది. ప్రయాణికులకు నష్టపరిహారం చెల్లించే విషయమై 2010 ఆగస్టు 6న డిజిసిఎ జారీ చేసిన సర్క్యులర్‌ను చీఫ్ జస్టిస్ దేవేంద్ర కుమార్ ఉపాధ్యాయ, జస్టిస్ తుషార్ రావుతో కూడిన బెంచ్ ఈ సందర్భంగా ప్రస్తావించింది. బోర్డింగ్‌ను తిరస్కరించిన, విమానాలు రద్దయిన, ఆలస్యమైన సందర్భాల్లో ప్రయాణికులకు కల్పించే సౌకర్యాలు, నష్టపరిహారం గురించి ఆ సర్క్యులర్‌లో పేర్కొన్నారు. పరిహారం చెల్లింపు నిబంధనకు ప్రతివాది 3 (ఇండిగో) కచ్చితంగా కట్టుబడి వుండాలని, అలాగే కేంద్ర పౌర విమానయాన శాఖ, డిజిసిఎలు నిర్ధారించాలని కోర్టు ఆదేశించింది. సర్క్యులర్‌లో పేర్కొన్న వాటికి అదనంగా నష్టపరిహారం చెల్లింపు చర్యలేవైనా అందుబాటులో వున్నట్లైతే వాటిని కూడా అధికారులు నిర్ధారించాలని కోర్టు పేర్కొంది. వెంటనే నష్టపరిహారం చెల్లింపు చర్యలను ప్రారంభించాలని ఎయిర్‌లైన్స్‌ను బెంచ్ ఆదేశించింది. కేవలం విమానాలు రద్దయితేనే కాదు, ఇతరత్రా ప్రయాణికులు పడిన ఇబ్బందులకు కూడా చెల్లించాలని పేర్కొంది. దేశవ్యాప్తంగా పలు విమానాశ్రయాల్లో వందల సంఖ్యలో ప్రయాణికులు గంటల కొద్దీ పడిగాపులు పడడాన్ని ప్రస్తావించింది. ఏళ్ల తరబడి తాము పెంచుకుంటూ వచ్చిన పేరు ప్రతిష్టలను ఈ సంఘటన దెబ్బతీసిందని ఇండిగో అంగీకరించింది. అయితే ఇలాంటి అంగీకారాల వల్ల ప్రయోజనమేమీ లేదని, దీనికి ఎలాంటి చట్ట ప్రాతిపదిక లేదని బెంచ్ పేర్కొంది.



## వందేమాతరం దేశ ప్రజల ఐక్యతకు దిక్సూచి



వందేమాతరం దేశ ప్రజల ఐక్యతకు దిక్సూచి అని, అయితే దాన్ని బిజెపి రాజకీయం చేస్తోందని ప్రతిపక్ష నేతలు ధ్వజమెత్తారు. అలాగే చరిత్రను వక్రీకరిస్తోందని విమర్శించారు. దేశం బ్రిటీష్ పాలనలో ఉన్నప్పుడు వందేమాతరం పాడినందుకు అనేక మంది స్వాతంత్ర్య సమరయోధులు, దేశ ప్రజలు అరెస్టయ్యారని గుర్తుచేశారు. ఇలా ఒక్కరైనా బిజెపి, నాటి సంఘపరివార్ వ్యక్తులు అరెస్టయ్యారా? అంటూ అధికార బిజెపిని ప్రతిపక్ష నేతలు నిలదీశారు. వందేమాతరం 150వ వార్షికోత్సవం సందర్భంగా జరిగిన ప్రత్యేక చర్చ రాజ్యసభలో బుధవారం రెండో రోజూ కొనసాగింది. కాంగ్రెస్ ఎంపి జైరాం రమేష్ మాట్లాడుతూ.. జవహర్‌లాల్ నెహ్రూను అప్రతిష్టపాలు చేయడమే లక్ష్యంగా ఈ చర్చను నిర్వహించాలని ప్రభుత్వం తీసుకున్న చర్య అని విమర్శించారు. బిజెపి నేతలు నెహ్రూను అవమానించినప్పుడు, స్వాతంత్ర్య పోరాటంలో పోరాడిన ప్రతి ఒక్కరినీ అవమానిస్తున్నారని ఆయన అన్నారు. మన రాజకీయాల్లో చరిత్ర చాలా తక్కువ, మన చరిత్రలో రాజకీయాలు చాలా ఎక్కువని అన్నారు. ప్రధాని మోడీ, హోంమంత్రి అమిత్ షా, ప్రభుత్వం వైపు ఉన్న ఇతర వ్యక్తులను ప్రస్తావిస్తూ, వారు చరిత్రకారులుగా మారాలని నిర్ణయించుకున్నారని, కానీ 'వక్రీకరించేవారు' అయ్యారని ఎద్దేవా చేశారు. మహాత్మా గాంధీ, మౌలానా ఆజాద్, రవీంద్రనాథ్ ఠాగూర్, జవహర్‌లాల్ నెహ్రూ, ఇతర నాయకులతో సహా కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమిష్టి నిర్ణయం ప్రకారం వందేమాతరం ప్రస్తుత వెర్షన్‌ను ఉపయోగించారని అన్నారు. బిజెపి మతం ఆధారంగా ప్రజలను విభజిస్తోందని సిపిఎం ఎంపి ఎఎ రహీం అన్నారు. దేశం ఐక్యతతో వలసవాదానికి వ్యతిరేకంగా పోరాడిందని, ఆనాడు 'మతం ఆధారంగా విభజన జరగలేదు' అని ఆయన అన్నారు.

Printed, Published and Owned by B.PRAMOD KUMAR, B258, Phase1, Vanasthalipuram, Hyderabad70. Printed at Garuda Printers, Plot No.91, Sri Ramnagar Colony, Kharmanghat, Hyderabad500035, Telangana. Published at H.No. B258, Phase1, Vanasthalipuram, Hyderabad500070, Telangana. Editor: N.Ramakrishna Reddy, email: citytimestd@gmail.com, RNI: APTEL/2001/5896